


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 25-08-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 300 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## అవినీతిని కూకటివేళ్లతో
# పెకలించాల్సిందే

### అవినీతి చేయాలంటే భయపడే స్థాయికి రావాలి

### 1902 నెంబర్‌ను కూడా ఏసీబీతో అనుసంధానం చేయాలి

### ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అమరావతి : రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి ఉండకూడదని, అవినీతిని కూకటివేళ్లతో పెకలించాల్సిందేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అవినీతి చేయాలంటే భయపడే స్థాయికి రావాలన్నారు. అవినీతికి ఆస్కారం లేని విధానాలతో ముందుకు వెళ్లాలని చెప్పారు. అవినీతి నిర్మూలనపై ముఖ్యమంత్రి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. 14400 కాల్ సెంటర్, కేబినెట్ సబ్ కమిటీ నివేదిక, ఐఐఎం అహ్మదాబాద్ నివేదిక, రివర్స్ టెండరింగ్, జ్యుడిషియల్ ప్రివ్యూ తదితర అంశాలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1902 నెంబర్‌ను కూడా ఏసీబీతో అనుసంధానం చేయాలి. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి అవినీతిపై వచ్చే ఫిర్యాదులను కూడా స్వీకరించాలి. వచ్చిన ఫిర్యాదులను మానిటరింగ్ చేసే వ్యవస్థ బలంగా ఉండాలి. 1902కు వచ్చే కాల్స్‌పై బలోపేతమైన అమలు విభాగం ఉండాలి. దీనికి కలెక్టర్

తరువాయి 2లో..

## కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియా గాంధీ కొనసాగింపు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీలో కీలక పరిణామాల అనంతరం సోనియా గాంధీనే పార్టీ చీఫ్‌గా కొనసాగించాలని నిర్ణయించారు. ఆర్నెల్ల లోగా నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవాలని.. అంతవరకు సోనియానే తాత్కాలిక అధ్యక్షురాలిగా కొనసాగాలని సీడబ్ల్యూసీ భేటీలో నిర్ణయించారు. సోమవారం (ఆగస్టు 24) ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభమైన సీడబ్ల్యూసీ భేటీ వాడీవేడీగా కొనసాగింది. 7 గంటల సుదీర్ఘ మంతనాల అనంతరం సోనాయానే అధ్యక్షురాలిగా కొనసాగాలని నేతలంతా కోరగా.. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ సీనియర్ నేతలు లేఖ రాయడం పట్ల రాహుల్ గాంధీ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో లేఖ రాసిన నేతలంతా బీజేపీతో కుమ్మక్కయ్యారా అని రాహుల్ వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలను గులాంనబీ ఆజాద్, కపిల్ సిబల్ తొలుత ఖండించారు. ట్వీట్లు కూడా చేశారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా పనిచేస్తున్న తమపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగునా అని ప్రశ్నించారు. తాము బీజేపీకి అనుకూలంగా ఎప్పుడు మాట్లాడలేదని చెప్పారు. బీజేపీతో కుమ్మక్కైన విషయాన్ని నిరూపిస్తే రాజీనామా చేస్తానని గులాం నబీ ఆజాద్ అన్నారు.

మరోవైపు రాహుల్ గాంధీతో వ్యక్తిగతంగా మాట్లాడిన తర్వాత

తరువాయి 2లో..

## 560 ఆసుపత్రిల్లో ఆరోగ్య శ్రీ సేవలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 560 ఆసుపత్రిల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందిస్తున్నామని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బూసి రెడ్డి నరేంద్ర రెడ్డి తెలిపారు. కరోనా వైరస్ కారణంగా అనేక ఇబ్బందులు పడుతూ వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. గతంలో ఆస్పత్రి నిర్వహణ చాలా కష్టతరంగా ఉండేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 650 కోట్ల రూపాయల బకాయిలను తీర్చడం వల్ల కష్టాల నుంచి బయటపడ్డమని పేర్కొన్నారు.

ఆరు నెలల క్రితం జీతాలు కూడా చెల్లించలేని స్థితిలో ఆరోగ్య శ్రీ ఆసుపత్రిలు ఉన్నాయని గుర్తుచేశారు. కరోనా కష్టకాలంలోనూ సీఎం జగన్ స్పందించి తగిన నిధులు కేటాయించారని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాము కూడా ప్రభుత్వానికి అండగా ఉంటూ కోవిడ్ బాధితులకు సేవలు అందిస్తామని చెప్పారు. గతంలో పనిచేసినా నిధులు సరిపడా

తరువాయి 2లో..

## 'జగనన్న పాలనలో జలాశయాలకు నిండుదనం'

### జల వనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్



నెల్లూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వరుసగా రెండోసారి జలాశయాలకు నిండుదనం వచ్చిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. సోమ వారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని జలాశ యాలను పూర్తిస్థాయి సామర్థ్యంతో నింపుతామన్నారు. "గతంలో దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో భారీగా వర్షాలు కురిశాయి. మళ్ళీ జగనన్న పాలనలోనే ఈ జలాశయాలకు నీళ్లు వస్తున్నాయి. సోమశిల చరిత్రలో గత ఏడాది మొదటి సారి పూర్తి సామర్థ్యం 78 టీఎంసీల మేర నీటిని నింపాం. ఈ ఏడాది కూడా 78 టీఎంసీల మేర నీటిని నింపుతాం. కండలేరు జలాశయానికి కూడా నీటిని విడుదల చేస్తున్నాం. ఈ ఏడాది పంటలకు సమృద్ధిగా నీటిని అందిస్తామని" మంత్రి పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు

తరువాయి 2లో..

## ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు

### విశాఖను పరిపాలన రాజధానిగా తీర్చిదిద్దుతాం

### రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రివర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం: ప్రభుత్వంపై ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మంత్రి అవంతి శ్రీనివాస్ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు.

విశాఖపట్నం నగరంలోని చిల్డ్రన్ ఏరినా లో సోమవారం మధ్యాహ్నం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు మీడియా తో మాట్లాడుతూ... ప్రభుత్వం మీద ప్రతిపక్షాలు బురద జల్లడమే పనిగా పెట్టుకుందని అన్నారు. మూడు రాజధానులు వ్యతిరేకిస్తున్నారు. ఇంగ్లీష్ మీడియం వ్యతిరేకించారు. ప్రతిపక్షాలు తాత్కాలికంగా నిలుపుదల చేయగలవు తప్ప శాశ్వతంగా నిలుపుదల చెయ్యలేరని అన్నారు. అమరావతి శాసనసభ

తరువాయి 2లో..

## ఏపీలో కొనసాగుతున్న కరోనా విజృంభణ

### - ఒక్కరోజులో 86 మంది మృతి

అమరావతి : ఏపీలో కరోనా కేసుల విజృంభణ కొనసాగుతోంది. 24 గంటల వ్యవధిలో 54,463 నమూనాలను పరీక్షించగా 8,601 మందికి కరోనా నిర్ధారణ అయింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ బులెటిన్ విడుదల చేసింది. దాని ప్రకారం ఒక్కరోజులో 86 మంది కరోనాతో మృతిచెందారు. నెల్లూరులో 10 మంది, ప్రకాశం 10, చిత్తూరు 8, కడప 8, శ్రీకాకుళం 7, విశాఖపట్నం 7, అనంతపురంలో 6, కృష్ణాలో 5, విజయనగరం 4, కర్నూలు 2, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్కరు మరణించారు. ఒక్కరోజులో 8,741 మంది కరోనా నుంచి కోలుకున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 32,92,501 నమూనాలను పరీక్షించినట్లు ప్రభుత్వం బులెటిన్‌లో పేర్కొంది.




## జిల్లాలో రోజుకు 6 వేల కోవిడ్ టెస్టులు నిర్వహించాలి

### జిల్లా కలక్టరు వి.వినయ్ చంద్



విశాఖపట్నం : ప్రతిరోజూ జిల్లాలో పట్టణ పరిధిలో 4 వేలు, గ్రామీణ పరిదిలో 2 వేలు కోవిడ్ టెస్టులు చేయాలని జిల్లా కలక్టరు వి.వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుండి 22 తేదీల మధ్య వచ్చిన కేసులలో 80 శాతం కేసులు పట్టణ పరిధిలోను, 21 శాతం కేసులు గ్రామీణ పరిధిలోను నమోదయ్యాయని తెలిపారు. మరణాలలో 66 శాతం పట్టణ పరిధిలో నమోదు కాగా 34 శాతం గ్రామీణంలో సంభవించాయన్నారు. జిల్లాలో టెస్టులు తగినంత వేగంగా జరుగు టలేదని కంటైన్ మెంటు జోన్, ఏక్టివ్ క్లస్టర్స్ లలోను, అనుమానిత లక్షణాలున్నవారినకి, 60 సంవత్సరాల పైబడినివారికి వీలైనంత వేగంగా టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. పి.హెచ్.సి. స్థాయినుండే టెస్టులు సంఖ్య పెంచాలన్నారు. మొబైల్ టెస్టింగు సదుపాయాలను వినియోగించుకోవాలని తెలిపారు.

జిల్లాలో తగినంత సంఖ్యలో టెస్టులు చేయకపోవడం, టెస్టుల రిజల్టు ఆలస్యంగా ఇవ్వక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. టెస్టుల ఫలితాలు ప్రకటించుటకు ఎక్కువ సమయం తీసుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. ఐ.సి.ఎం.ఆర్. వారు జిల్లాలో నిర్వహిస్తున్న టెస్టులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. పట్టణ పరిధిలో ప్రతి వార్డుకు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుచేయాలని, ఇద్దరు డాక్టర్లు, సిబ్బందిని నియమించి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. టెస్టులు గ్రామ, వార్డు స్థాయినుండే నిర్వహించాలన్నారు. గ్రామీణంలో ఆశ వర్కర్ల సేవలు ఉపయోగించుకోవాలన్నారు. సచివాలయాలలో ఇంటర్నెట్ సదుపాయలు ఏర్పాటుచేసి, డిజిటల్ అసిస్టెంటు ద్వారా డేటా నమోదు చేయించాలన్నారు. డిజిటల్ అసిస్టెంటు లేకపోతే తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలన్నారు.

పాజిటివ్ వచ్చిన వారిని, కాంటాక్ట్ కేసులు, హెూమ్ ఐసోలేషనులో ఉన్నవారిని మ్యాపింగు చేయాలన్నారు. వారివివరాలు యాప్ నందు

తరువాయి 2లో..

# స్పందనకు 123 వినతులు

**- జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి**



శ్రీకాకుళం, : స్పందన కార్యక్రమానికి 123 వినతులు అందాయి. సోమవారం ఉదయం స్పందన కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి, కలెక్టర్ కార్యాలయం హెచ్.సెక్షన్ సూపరింటెండెంట్ అప్పారావు, భాస్కరరావులు నిర్వహించారు. ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న డయల్ యువర్ కలెక్టర్, స్పందన కార్యక్రమాల్లో ప్రజల అర్జీలను భౌతికంగా కాకుండా ఫోన్ ద్వారా స్వీకరించేందుకు ప్రతీ సోమవారం ఉదయం 09.00గం.ల నుండి మధ్యాహ్నం 12.00గం.ల వరకు స్వీకరిస్తున్న సంగతి విదితమే. అందులో భాగంగా సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాలకు చెందిన 123 మంది అర్జీదారులు తమ ఫిర్యాదులను జిల్లా రెవిన్యూ అధికారికి విన్నవించారు. వజ్రపు కొత్తూరు మండలం కొండపూర్ నుండి మెట్టా గౌరి ఫోన్ చేస్తూ తమ గ్రామంలోని స్వంత పొలాల్లో అక్రమంగా కాలువలు, సి.సి.రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నారని, కావున బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు.

నగరపాలక సంస్థ పరిధిలోని ఏనుగుల మహల్ వీధి నుండి దుర్గ జోగయ్య మాట్లాడుతూ తనకు గత 7 మాసాల నుండి వృద్ధాప్యపు పింఛను మంజూరుచేయడం లేదని, తన తండ్రి ప్రభుత్వ ఉద్యోగి అని సాకులు చెపుతున్నారని, కావున దీనిపై తగిన న్యాయం చేయాలని ఫిర్యాదు చేసారు.

ఎచ్చెర్ల మండలం బలిజిపేట నుండి గుండు పోలారావు ఫోన్ చేసి మాట్లాడుతూ తన తండ్రికి వెన్నముక శస్త్రచికిత్స జరిగిందని, ఇందుకు సిఎం రిలీఫ్ ఫండ్ నుండి 35 వేల రూపాయలు మంజూరైందని, కావున దానిని ఇప్పించాలని కోరారు.

పాతపట్నం మండలం తామర నుండి మజ్జి గిరిబాబు మాట్లాడుతూ తమకు చెందిన పట్టాదారు పాసుపుస్తకాన్ని పేరు మార్పు చేయాలని కోరుతూ 20 రోజులు గడిచినప్పటికీ ఇంతవరకు మంజూరుచేయలేదని ఫిర్యాదు చేసారు.

జలుమూరు మండలం లింగాలవలస నుండి చింతాడ ధర్మారావు మాట్లాడుతూ తనకు చెందిన రేషన్ బియ్యాన్ని గత మూడు మాసాలుగా మంజూరుచేయడం లేదని ఫిర్యాదు చేసారు. వంగర మండలం అరసాడ నుండి యం.లక్ష్మీ ఫోన్ చేసి మాట్లాడుతూ పల్స్ సర్వేలో తప్పుడు సమాచారం వలన తమ కుటుంబం నుండి వేరుగా ఉన్నప్పటికీ తనకు వై.యస్.ఆర్.చేయూత పథకం వర్తింపచేయలేదని, ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. అరసవల్లి శిమ్మ వీధికి చెందిన యస్.తవుడు మాట్లాడుతూ తన పేరును రేషన్ కార్డు నుండి తొలగించినందున రేషన్ రావడం లేదని ఫిర్యాదు చేసారు.

రణస్థలం మండలం కె.లోచర్లపాలెం నుండి లోచర్ల అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ చెరువులను పూడ్చి కొందరు అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని, కావున బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు.

నరసన్నపేట హడ్కోకాలనీ నుండి యం.లక్ష్మీ మాట్లాడుతూ తనకు ఇంటిస్థలాన్ని మంజూరుచేయాలని కోరుతూ ఫిబ్రవరి మాసంలో దరఖాస్తు చేసినప్పటికీ ఇంతవరకు మంజూరుచేయలేదని ఫిర్యాదు చేసారు.

బూర్జ మండలం తొగరాం నుండి సి.పద్మావతి ఫోన్ చేస్తూ రైతు భరోసా డబ్బులు ఇంతవరకు అందలేదని, గత ఏడాది కూడా మంజూరుచేయలేదని, ఇప్పటికైనా మంజూరుచేయాలని కోరారు. జి.సిగడాం మండలం తాడివలస నుండి యస్.గోపాల్ నాయుడు మాట్లాడుతూ మడ్డువలస రిజర్వాయర్ నుండి నీటిని రానివ్వడం లేదని, ఈ విషయమై ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదుచేసినప్పటికీ ఎటువంటి పరిష్కారం కాలేదని ఫిర్యాదు చేసారు. దీనివలన పంటలు దెబ్బతినే అవకాశం ఉందని, కావున నీటిని విడుదల చేయాలని కోరారు. రేగిడి మండలం కొల్లివలస నుండి జె.గణేష్ మాట్లాడుతూ తాను ఏ.పి.యస్.డబ్ల్యు.ఆర్.యస్ కొల్లివలస రెసిడెన్షియల్ స్కూల్ నందు విద్యను అభ్యసిస్తున్నానని, తమకు ప్రతీ గురువారం ఇవ్వాల్సిన గ్రుడ్లు, రైస్ ఇవ్వడం లేదని ఫిర్యాదు చేసారు.

## కరోనా కాలానికి ముఠా కార్మికులకు ఆర్థిక సహాయం చేయాలి

**సీపీఎం కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్ డిమాండ్**




విశాఖపట్నం : కరోనా కాలంలో పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముఠా కార్మికులకు ప్రతి కుటుంబానికి 7500 రూపాయలు చొప్పున నగదు, మనిషికి 10కేజీల బియ్యం, 16 రకాల నిత్యావసర సరుకులు ఇచ్చి ఆదుకోవాలని, ఆరోగ్య సంరక్షణ కూడా ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్ డిమాండ్ చేసారు. సిపిఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా రేసపువానిపాలెం వద్ద ముఠా కళాసీలు నిరసన కార్యక్రమం జరిగింది. దీనిలో కుమార్ పాల్గొని మాట్లాడుతూ బిజెపి, వైసిపి ప్రభుత్వాలు కరోనాను నివారించడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. బిజెపి ప్రభుత్వం కరోనా కాలంలో ప్రజలను, కార్మికులను ఆదుకోవడం కంటే కార్పొరేట్ బడా పెట్టుబడిదారులను ఆదుకోవడంలోనే శ్రద్ధపెట్టిందన్నారు. కనీసం ఇఎస్ఐ, పిఎఫ్ వంటి ఏ కార్మికచట్టాలు పరిధిలోలేని ముఠా కార్మికులకు ప్రభుత్వ ఆదుకోకపోవడం దుర్మార్గమన్నారు. నిర్మాణ రంగం పూర్తి స్తంభించడంతో కార్మికులు పనులు కోల్పోయారన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా ప్రైవేటీకరణ చేయడం, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారాలు వేయడం వంటివి బిజెపి వేగవంతం చేసిందన్నారు. కేవలం జనధన్ ఖాతా దారులకు 500 రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ఇప్పటికే అసంఘటితరంగంలో అనేకమందికి ఉపాధి పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగభద్రత లేకుండా కార్మికచట్టాలను సైతం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు.

## విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీకి ఏర్పాట్లు




శ్రీకాకుళం : పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేయుటకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డా.జి.వి.రమణకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమ వారం ఒక ప్రకటన విడుదల చేస్తూ డా.వై.యస్.ఆర్.కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. సమగ్ర కంటి వైద్య సేవలు ఉచితంగా అందిచుటకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి 2019 అక్టోబరు 10వ తేదీన కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. ఇందులో భాగంగా మొదటి, రెండవ దశలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 12,069 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని నిర్ధారించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి 6,872 కంటి అద్దాలను బడి పిల్లలకు పంపిణి చేసామని ఆయన తెలిపారు. ఇంకా 5,197 కంటి అద్దాలను ప్రధానో పాధ్యాయులు ద్వారా పంపిణీ చేయాల్సి ఉందని చెప్పారు. కోవిడ్ 19 కారణంగా పాఠశాలలు ప్రారంభించకపోవడంతో కంటి అద్దాల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయలేదని ఆయన చెప్పారు. పాఠశాలలు ప్రారంభిం చేందుకు ప్రభుత్వం సన్నద్ధం కావడంతో విద్యార్థులకు 5,197 కంటి అద్దాలు పంపిణీ చేయుటకు అనుగుణంగా ఆగష్టు నెలలో కంటి అద్దాలను సంబంధిత పాఠశాలలకు అందజే యాలని నిర్ణయించామని వివరించారు. సెప్టెంబర్ నెలలో పాఠశాలల ప్రారంభ సమయానికి, పాఠశాలలలో కంటి అద్దాలు పంపిణీకి అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా విద్యా శాఖ సమన్వయంతో ఆప్తాల్మిక్ ఆఫీసర్లతో కంటి అద్దాలను సంబంధిత పాఠశాలలకు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. కంటి అద్దాల బాక్స్ పై విద్యార్థి వివరాలు ముద్రించి ఉంటాయని ఆయన వివరించారు. తల్లిదండ్రులు గాని, సంబంధిత విద్యార్థులు గాని పాఠశాలలను సంప్రదించి కంటి అద్దాలు పొంది, ఆరోగ్య సిబ్బంది సలహా మేరకు అద్దాలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ : మహా విశాఖ 7 వ వార్డ్ లో గల పీఎంపాలెం విద్యుత్ సబ్ స్టేషను పరిధిలో మిధిలాపురి వుడా కాలనీ 11కెవి ఫీడర్ సంబంధించిన చెట్టు కొమ్మలు తొలగింపు మరియు ఇతర మరమ్మత్తులు కారణంగా ఈ రోజు ఉదయం తొమ్మిది 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రెవిన్యూ లే అవుట్, ఎం జే ఆర్ లే అవుట్, షిప్ యార్డ్ లే అవుట్,వాటర్ ట్యాంక్ ఏరియా,బింద్రా నగర్,ఎన్టీఆర్ హుధుద్ బ్లాక్స్, మరియు మిధిలాపురి వుడా కాలనీ తదితర ప్రాంతాలల్లో జోన్ 3 డివిజినల్ ఇంజనీర్ సింహాచలం నాయుడు ఆదేశాలు మేరకు విధ్యుత్ సరపరా నిలిపి చేయనున్నట్లు వినియోగదారులు సహకరించ వలసినిదిగ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.నరేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రాజధాని రైతులకు అండగా ఉండాలి



అమరావతి : అమరావతి ఉద్యమం 250వ రోజుకు చేరుకున్నా ప్రభుత్వంలో చలనం లేదని తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఇంత సుదీర్ఘ ఉద్యమాలు అరుదుగా జరిగాయన్నారు. ఆందోళనకారుల బాధ వినడానికి కూడా ముందుకు రాని పాలకులు కూడా అరుదేనని వ్యాఖ్యానించారు. వేలాది మంది ఉద్యమకారులపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపారని విమర్శించారు. ఉద్యమంలో 85 మంది రైతు కూలీలు, రైతులు, మహిళలు అమరులైనా ప్రభుత్వం తమాషా చూస్తోందని ఆరోపించారు.

అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలన్న తెలుగుదేశం డిమాండ్‌కు వైకాపా ముందుకు రాలేదంటే.. మూడు రాజధానుల నిర్ణయానికి 13 జిల్లాల ప్రజల మద్దతు లేనట్టే నన్నారు. అమరావతి శంకుస్థాపనకు 13వేల గ్రామాల నుంచి పవిత్ర మట్టి, పుణ్య జలాలు తెచ్చారంటేనే.. అమరావతిని అందరూ రాజధానిగా గుర్తించినట్టు అని తెలిపారు. రాష్ట్రం కోసం భూములు త్యాగం చేసిన రైతులకు అండగా ఉండాల్సిన బాధ్యత 13 జిల్లాల ప్రజలపై ఉందన్నారు.

**తప్పును సరిదిద్దుకోవాలి: లోకేశ్**

పాలకుడు మానిప్పుడల్లా రాజధాని మార్చడమేంటని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ప్రశ్నించారు. వికృత ఆలోచనతో 85 మంది రైతులను బలితీసుకున్నారని సీఎం జగన్ తీరుపై ధ్వజమెత్తారు. రాజధాని పోరాటం మొదలై 250 రోజులైందని, ఇప్పటికైనా తప్పు దిద్దుకోవాలని సూచించారు. మూడు రాజధానుల పేరుతో ఎస్సీలకు అన్యాయం చేస్తున్నారని తెదేపా ఎమ్మెల్యే బాల వీరాంజనేయ స్వామి మండిపడ్డారు. ప్రజా ఆమోదంతో ఏర్పాటైన రాజధానిని జగన్ ఎందుకు మారుస్తున్నారని నిలదీశారు.

మొదటి పేజీ తరువాయి

## ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు

రాజధానిగా ఉంచుతూ విశాఖపట్నం పరిపాలన రాజధాని, కర్నూల్ న్యాయ రాజధాని చేసి తీరుతామని మంత్రి అవంతి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఐదు సంవత్సరాల కాలం లో చంద్రబాబు అమరావతి పేరు చెప్పి కాలయాపన చేశారు. కానీ సీఎం జగన్ మోహన్ రెడ్డి రాయలసీమ లో కర్నూల్,ఉత్తరాంధ్ర విశాఖలో ప్రభుత్వ అతిథి గృహాన్ని నిర్మించే ఆలోచన చేశారు. జీవో 1087 విశాఖ, కాకినాడ, కర్నూల్, విజయవాడ లో ప్రభుత్వ అతిథి గృహాలు కట్టాలని కలెక్టర్ లను ఛైర్మెన్ గా చేసి ఉత్తరువులు ఇచ్చారన్నారు. ప్రభుత్వ అతిథి గృహం నిర్మించే స్థలానికి , తొట్ల కొండ కు సంబంధం లేదన్నారు. తొట్ల కొండ కు, బావి కొండ కు ..ప్రభుత్వ అతిథి గృహం నిర్మిద్దాం అనుకుంటున్న స్థలానికి కిలోమీటర్ దూరం ఉంది.. అది తెలియకుండా.. విమర్శలు చేయడం తగదన్నారు. చంద్రబాబు, గంటా శ్రీనివాసరావు కలిసి ఫిల్మ్ క్లబ్ కట్టడానికి అడుగులు వేశారు...వాళ్ళు ఇప్పుడు అనవసరంగా రాద్ధాంతంగా మాట్లాడుతున్నారు. ఈ విషయంలో రఘురామకృష్ణంరాజు శిఖండి లా వ్యవహరిస్తున్నారని అన్నారు. అసలు తోట్లకొండ ఎక్కడ ఉందో, బావి కొండ ఎక్కడ ఉందో తెలియకుండా రఘు రామకృష్ణంరాజు కేంద్రానికి లేఖలు రాయటం ఏంటి అని మండిపడ్డారు. నర్సాపురం అభివృద్ధికి ఆలోచించాలి నిజంగా అభిమానం ఉంటే రాజీనామా చేసి మళ్లీ పోటీ చేసి గెలవాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు మంచి వారన్నారు. ఇక్కడి ప్రజలు రాజధాని కోరుకోవడం లేదని పైయిడ్ ఉద్యమాలు చేస్తే , ఇక్కడ మేము ఉద్యమాలు చేసే శక్తి ఇక్కడి ప్రజలకు ఉందన్నారు. సోషల్ జస్టిస్ అనే పవన్ రాజధాని కోసం రెండు వేల ఎకరాలు చాలు అన్నారు.ఇప్పుడు విమర్శలు చేస్తూ చంద్రబాబు స్క్రిప్ట్ చదువుతున్నారని అన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్ నగర శాఖ అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి మళ్ల విజయప్రసాద్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కే కే రాజు , తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త విజయనిర్మల, సీనియర్ నాయకులు రొంగలి జగన్నాథం పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## అవినీతిని కూకటివేళ్లతో పెకలించాల్సిందే

కార్యాలయాలను కూడా అనుసంధానం చేయాలి. టౌన్ ప్లానింగ్, సబ్ రిజిస్ట్రార్, ఎమ్మార్వో, ఎండీఓ కార్యాలయాల్లో అవినీతి ఆనవాళ్లు ఉండకూడదు. దీనిపై ఫోకస్‌గా ముందుకు వెళ్లండి. 14400 నెంబర్‌పై మరింత ప్రచారం నిర్వహించండి, పర్మినెంట్ హోర్డింగ్స్ పెట్టండి. రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన కేసుల్లో చర్యలు తీసుకోవడానికి సంవత్సరాల కాలం పట్టకూడదు. అవినీతికి పాల్పడుతూ, లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ కేసుల్లో కూడా దిశ చట్టం మాదిరిగానే నిర్దిష్ట సమయంలో చర్యలు తీసుకునేలా ఉండాలి. కొన్ని అవినీతి కేసుల విచారణ 25 ఏళ్లుగా సాగుతోంది అంటే.. అవినీతి నిరోధకత విషయంలో సీరియస్‌గా లేమనే సంకేతాలు వెళ్తున్నాయి. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన తర్వాత వెంటనే చర్యలు తీసుకునేలా విధానాలు ఉండాలి. దీనికోసం అసెంబ్లీలో చట్టం తీసుకువచ్చేలా బిల్లును రూపొందించాలి.

**28 ఏళ్ల కాలంలో ప్రభుత్వానికి రూ.322 కోట్లు**

కర్నూలు జిల్లా పిన్నాపురం విద్యుత్ ప్రాజెక్టు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో 2018, జులైలో ఒప్పందం కుదిరింది. 4,766.28 ఎకరాల భూమిని సదరు కంపెనీకి ఇచ్చారు. అప్పటి ప్రభుత్వంలో ఎకరాకు కంపెనీ చెల్లించే మొత్తం రూ.2.5 లక్షలు మాత్రమే. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత అదే కంపెనీతో తిరిగి సంప్రదింపులు జరిపింది. అవే స్పెసిఫికేషన్లతో విద్యుత్ ప్రాజెక్టు ఆ కంపెనీ నిర్మాణానికి ఓకే అంది. ప్రభుత్వానికి ఎకరాకు రూ.2.5 లక్షలకు బదులు రూ.5 లక్షలు ఇవ్వడానికి ఒప్పుకుంది. ఎకరాకు అదనంగా రూ. 2.5 లక్షలు ఈ ప్రభుత్వం తీసుకురాగలిగింది. దీని వల్ల అదనంగా రూ.119 కోట్ల ఆదాయం వస్తోంది. అలాగే సోలార్/విండ్ కింద ఉత్పత్తి చేసే 1550 మెగావాట్ల ఉత్పత్తికి గాను మెగావాట్‌కు రూ.1 లక్ష చెల్లించేందుకు కంపెనీ అంగీకరించింది. దీని వల్ల ఏడాదికి రూ.15.5 కోట్ల చొప్పున 28 ఏళ్ల కాలంలో రూ.322 కోట్లు ప్రభుత్వానికి వస్తాయి.

అంతే కాక రివర్స్ పంపింగ్ ద్వారా ఉత్పత్తి చేయనున్న 1680 మెగావాట్ల కరెంటుకు గాను, మెగావాట్‌కు మొదటి పాతికేళ్లలో రూ.1 లక్ష, తద్వారా ఏడాదికి రూ.16.8 కోట్లు, 25 ఏళ్ల తర్వాత రూ.2 లక్షలు చొప్పున ఏడాదికి రూ.33.6 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. దీని వల్ల ప్రభుత్వానికి అదనంగా రూ. 2,940 కోట్లు ఆదాయం వస్తుంది. ఈ ప్రభుత్వం వచ్చాక అదే కంపెనీతో సంప్రదింపులు కారణంగా రూ.3,381 కోట్లు ప్రభుత్వానికి అదాయం వస్తోంది. ఇదే గత ప్రభుత్వంలో కేవలం రూ.119 కోట్లు మాత్రమే ఆదాయాన్ని చూపించారు. ప్రభుత్వానికి ఈ రకమైన మేలు చేయడానికి ప్రయత్నించిన అధికారులను అభినందిస్తున్నా.

**రివర్స్ టెండరింగ్ :**

సుపరిపాలనలో భాగంగా, విప్లవాత్మక మార్పుగా చేపట్టిన రివర్స్ టెండరింగ్ పైనా అధికారులు సీఎంకు వివరాలు అందించారు. మొత్తంగా 788 టెండర్లకు రివర్స్ టెండరింగ్ నిర్వహించామని తెలిపారు. సాధారణ టెండర్ల ప్రక్రియ ద్వారా 7.7 శాతం మిగులు ఉండగా, రివర్స్ టెండరింగ్ ద్వారా 15.01 శాతం మిగులు ఉంటుందని వెల్లడించారు.

**జ్యుడిషియల్ ప్రివ్యూ:**

రూ.100 కోట్లు దాటిన ఏ ప్రాజెక్టుకైనా జ్యుడిషయల్ ప్రివ్యూకు వెళ్తున్నామని అధికారులు వివరించారు. 2019 ఆగస్టు నుంచి 2020 ఆగస్టు వరకు 45 ప్రాజెక్టులు ఆ ప్రివ్యూకు వెళ్లాయని చెప్పారు. రూ.14,285 కోట్లు విలువైన పనులు జ్యుడిషయల్ ప్రివ్యూకు వెళ్లాయని ముఖ్యమంత్రికి అధికారులు వెల్లడించారు.

## జిల్లాలో రోజుకు 6 వేల కోవిడ్ టెస్టులు నిర్వహించాలి

అప్ లోడ్ చేయాలన్నారు. వై.ఎస్.ఆర్. హెల్త్ క్లినిక్ స్వంత భవనాలు నిర్మాణానికి 400 లేక 450 గజాలు స్థలం పరిశీలించి సిద్ధం చేయాలన్నారు. కోవిడ్ ఆసుపత్రిలకు ఆక్సిజన్ సరఫరా పై సమీక్షిస్తూ ఆక్సిజన్ సరఫరా చేస్తున్న సంస్థ కార్యకలాపాలపై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఆసుపత్రులలో బల్క్ ఆక్సిజన్ ట్యాంకులు సకాలంలో ఏర్పాటు చేయక పోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. 48 గంటలలో అన్ని ఆసుపత్రులకు ఆక్సిజన్ సరఫరా జరుగకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రులలో కావలసిన మానవ వనరులను సమీకరించుకోవాలని అధికారులకు తెలిపారు. ప్రభుత్వం నుండి ఆమోదం పొందిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అందుకు అవసరమైన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. పోస్టులు భర్తీ ప్రక్రియ నిబంధనల ప్రకారం జరగాలని తెలిపారు. సిబ్బంది అటెండెన్స్, పనితీరుపై పర్యవేక్షించేందుకు కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాకు కేటాయించిన వెంటిలేటర్స్ అవసరమైన ఆసుపత్రులకు సర్దుబాటు చేసారు. కోవిడ్ బాధిత గర్భిణీలకు, డయాలసిస్ కే.జి.హెచ్. లో చికిత్స అందించే ఏర్పాటు చేయాలని వైద్యాధికారులు కోరగా పరిశీలించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జి.వి.ఎం.సి. కమీషనరు జి.సృజన, వి.ఎం.ఆర్.డి.ఎ. అదనపు కమీషనరు మంజీర్, కె.జి.హెచ్. సూపరింటెండెంట్ డా. సుధాకర్, ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. విజయలక్ష్మి, డి.సి.హెచ్.ఎస్. డా. లక్మణరావు, విమ్స్ డైరెక్టరు సత్యప్రసాద్, చీఫ్ హెల్త్ సూపరింటెండెంట్ డా. శాస్త్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ‘జగనన్న పాలనలో జలాశయాలకు నిండుదనం’

ధరకే రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. వర్షాలు కురుస్తుండటంతో రంగు మారే అవకాశం ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియా గాంధీ కొనసాగింపు**

ఆయన అలా అనలేదని తెలిసిందని కపిల్ సిబల్ చెప్పారు. దీంతో రాహుల్ వ్యాఖ్యల్ని ఖండిస్తూ తాను చేసిన ట్వీట్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు సిబల్ మరో ట్వీట్ చేశారు. సీడబ్ల్యూసీ సమావేశం తర్వాత గులాం నబీ ఆజాద్ కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. బీజేపీతో కుమ్మక్కయ్యారన్న వ్యాఖ్యలను రాహుల్ గాంధీ చేయలేదని ఆయన తెలిపారు.

**560 ఆసుపత్రిల్లో ఆరోగ్య శ్రీ సేవలు**

అందలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో రెండు వారాల్లోనే నిధులు అందుతున్నాయని తెలిపారు.

సోమవారం విజయవాడలో బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి మీడియాతో మాట్లాడారు. ‘ఆరోగ్య శ్రీ సేవలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆరోగ్య శ్రీ కింద మరిన్ని సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. కోవిడ్ పేషెంట్‌లకు కూడా ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నాం. కరోనా పై ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. స్వల్ప లక్షణాలు ఉంటే హోం క్వారంటైన్‌లోనే ఉండాలి. పరిస్థితి తీవ్రంగా ఉంటేనే ఆస్పత్రికి రావాలి. ప్రతి కోవిడ్ ఆసుపత్రిలో ఎన్ని బెడ్లు ఉన్నాయనే సమాచారం ఆన్ లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. రాష్ట్రంలో కరోనా డెత్ రేట్ చాలా తక్కువగా ఉంది. జిల్లా కలెక్టర్ ద్వారానే ఆసుపత్రిలలో ఆరోగ్య శ్రీ అడ్మిషన్లు జరుగుతున్నాయి. ప్రజలు కూడా కోవిడ్ పై భయాలు పెట్టుకోకుండా అవగాహన పెంచుకోవాలి. దేశంలోనే ఏపీలో కోవిడ్ రోగులకు మంచి వైద్యం అందుతుంది. ఏ జిల్లాలో ఎటువంటి సాయం కావాలన్నా ఆరోగ్యశ్రీ అధికారులను సంప్రదించవచ్చు.’ అని తెలిపారు.

# జివియంసి కమిషనర్ ఇ-స్పందన నిర్వహణ



విశాఖపట్నం : పట్టణ పరిధిలో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతుండడం వలన ప్రజల వద్ద నుండి విన్నపములు నేరుగా స్వీకరించేందుకు అవకాశము ఉండుటలేదు. కావున, దీన్ని దృష్టిలో పెట్టుకొని జి.వి.ఎం.సి. కమిషనర్ డా. జి. సృజన అంతర్జాల సహాయముతో ఫేస్ బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల వద్ద నుండి విన్నపములు స్వీకరించుటకు సోమవారం ఇ-స్పందన కార్యక్రమం నిర్వహించవలసిందిగా అదనపు కమిషనర్ ఎ.వి.రమణిను ఆదేశించారు. ఈ ఇ-స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ఫిర్యాదులపై వివరణ ఇస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అదనపు కమిషనరు తెలిపారు.ఈ ఇ-స్పందన కార్యక్రమంలో పట్టణ పరిధిలో పలు ప్రాంతాల నుండి మొత్తము 138 ఫిర్యాదులు రాగా, అందులో 30 సాధారణ విచారణలకుగాను, 12 ప్రజారోగ్య విభాగానికి సంబం ధించినవి, 26 పబ్లిక్ వర్క్స్ విభాగానికి సంబందించినవి, 23 పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించినవి, 10 నీటి సరఫరా విభాగానికి, 05 వీధి లైట్ల విభాగానికి సంబందించినవి, 07 రెవెన్యూ విభాగానికి సంబందించినవి, 14 యు.సి.డి విభాగానికి సంబందించినవి, 02 పి.ఎల్.&ampబీసి. విభాగానికి సంబందించినవి, 02 కోవిడ్-19నకు సంబందించినవి, 03 వెటర్నరీ విభాగానికి మరియు 04 యు.జి.డి. విభాగానికి సంబందించినవి స్వీకరించుట జరిగినదని అదనపు కమిషనరు తెలిపారు. అదనపు కమిషనర్ ఎ. వి. రమణి ప్రజా ఆస్తుల ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తూ, వాటిని సత్వర పరిష్కారానికై చర్యలు తీసుకుంటామన్నారు.సదరు ఫిర్యాదులను సంబంధిత పట్టణ ప్రణాళికా అధికారులకు పంపమని ఆదేశించారు, రోడ్లు మరియు కాలువలు వంటి మౌళిక వసతుల ఏర్పాటుకు గాను వచ్చిన విన్నపములపై స్పందిస్తూ నగరంలో పలు మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని, కార్పొరేషన్ ఆర్ధిక వనరులు దృష్టిలో పెట్టుకొని, రోడ్లు, కాలువలు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు.ముఖ్యంగా, సుదూర ప్రాంతాలలో విలీన ప్రాంతాలందు వీటి ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు.

వచ్చిన విన్నపములు పరిశీలించి తగుచర్యలు చేపట్టే నిమిత్తం సంబంధిత ఇంజనీరింగు అధికారులకు పంపుతామన్నారు. పి.ఎం.ఏ.వై హౌసింగ్ పథకాల అంశంపై స్పందిస్తూ, వీటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారు లకు ఆదేశాలు ఇస్తామన్నారు. ఇకముందు, సచివాలయాల ద్వారా సమస్యలకు సంబందించిన విన్నపములు పెట్టుకోవాలని అర్జీదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై 138 మంది స్పందించి, వివరణలు తెలిపి, విన్నపములు సమర్పించారు. వీటిపై తగు చర్యలు తీసుకొనే నిమిత్తం సంబంధిత ప్రధాన విభాగపు అధికారులు/జోనల్ స్థాయి అధికారులకు పంపడానికి అదనపు కమిషనర్ ఎ.వి.రమణి చర్యలు తీసుకున్నారు.

# బీజేపీలో ఇరవైమంది చేరిక



భీమునిపట్నం : విశాఖ బీజేపీ నగర కార్యాలయం లో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర , బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాశీ విశ్వ నాథ రాజు ర్ల సమక్షంలో బీజేపీ భీమిలి మండల కన్వీనర్ కాళ్ళ కాసులు, బీజేపీ పద్మనాభం, ఆనందపురం మరియు భీమిలి మండలాల కోఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు, బీజేపీ సీనియర్ నాయకులు ఉప్పాడ అప్పారావు, బీజేపీ నాయకులు సంకురుభుక్త ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై భీమిలి మండలం బోడమెట్ట పాలెం గ్రామ పంచాయితీ పరిదిలో ఉన్న బోడమెట్టపాలెం, రామునాయుడు పేట గ్రామాల నుంచి సుమారు ఇరవై మంది బీజేపీ లో చేరారు. చేరిన వారిలో వారాధి అప్పల నాయుడు, పడగల సూరప్పడు లు ఉన్నారు. ఈ సందర్భంగా మేడపాటి రవీంద్ర , కాశీరాజు లు మాట్లాడుతూ మోడీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, కేంద్రం వ్యవసాయ దారులకు, గ్రామాలలో చేపట్టుతున్న కార్యక్రమాలను గ్రామస్తులకు వివరించాలని చెప్పారు.

మరియు సంకురుభుక్త ప్రకాష్, వారాధి అప్పల నాయుడు, పడగల సూరప్పడు లు మాట్లాడుతూ వచ్చే 5 రోజుల్లో బోడమెట్ట పాలెం, రామునాయుడు పేట గ్రామాల నుంచి సుమారు రెండు వందల మంది బీజేపీ లో చేరబోతున్నారని చెప్పారు.

## కార్పొరేట్ స్థాయిలో

## మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### - జగనన్న విద్యాకానుక లో భాగంగా స్కూల్ బ్యాగులు పంపిణీ



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ పి.అచ్యుతరావు

చోడవరం : జగనన్న విద్యా కానుక లో భాగంగా స్కూల్ బ్యాగులు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ పి.అచ్యుతరావు చేతుల మీదగా సోమవారం ప్రారంభించారు. మండలంలోని 60 ప్రభుత్వ పాఠశాలలకు గానూ ఒకటి నుంచి పదవ తరగతి చదువుతున్న సుమారు 6715 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొంద నున్నట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, టై, బెల్టు, మూడు జతల యూనిఫామ్స్, షూ, అందజేసేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ సిద్ధమవుతుంది అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాడు నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలలో కల్పించడంతోపాటు నాణ్యమైన విద్యను ప్రతి విద్యార్థినీ విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో...

ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోవిందరాజు, సుబ్రమణ్యం, లక్ష్మీదేవి, సిఆర్పి కెవిఎం. నాయుడు, నాగలక్ష్మి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వైజగపటం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (విసిసిఐ) అధ్యక్షుడు వీర మోహన్, కార్యదర్శి రవి గోడే, డైరెక్టర్ ధర్మేంద్రదత్ ఐలాండ్ లో సెమినార్

విశాఖపట్నం: నిర్మాణ పరిశ్రమ ఇటీవల ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి వైజగపటం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (విసిసిఐ) అధ్యక్షుడు వీర మోహన్, కార్యదర్శి రవి గోడే డైరెక్టర్ ధర్మేంద్ర సోమవారం దత్ ఐలాండ్ లో సెమినార్ ను నిర్వహించారు అనంతరం ఈ క్రింది విజ్ఞప్తిని ముఖ్యమంత్రి, ముఖ్య కార్యదర్శి, పట్టణాభివృద్ధి అథారిటీ మంత్రి, ప్రధాన కార్యదర్శి, పట్టణ అభివృద్ధి అథారిటీ మంత్రిత్వ శాఖ, మునిసిపల్ కమిషనర్. గౌరవప్రదంగా సమర్పించారు. వైజగపటం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (విసిసిఐ) 1931 లో స్థాపించబడింది. అప్పటి నుండి, విసిసిఐ ప్రభుత్వానికి వివిధ వ్యాపార మరియు పౌరులకు సంబంధించిన సమస్యలను సూచిస్తుంది.మహమ్మారి కరోనా వైరస్ వలన భారీగా ఎదురుదెబ్బ తగిలినందున నిర్మాణ, రియల్ ఎస్టేట్స్ రంగాలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా మహమ్మారిలో ప్రకృతి వల్ల కలిగే విపత్తుగా ప్రకటించింది మరియు దీనిని "ఫోర్స్ మేజూర్" గా పరిగణించాలని కోరారు. కొన్ని మంత్రిత్వ శాఖలలోని భారత ప్రభుత్వం ఈ మహమ్మారిని తమ సేకరణ ఒప్పందంలో ఒక శక్తి మేజూర్గా ప్రకటించింది. ఫోర్స్ మేజూర్ నిబంధనపై భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ (ప్రొక్యూ ర్మెంట్ డివిజన్) జారీ చేసిన



కోవిడ్-19 వైడ్ ఆఫీస్ మెమోరాండం కారణంగా అటువంటి ప్రకటన గురించి సూచన ఉంది.అటువంటి ప్రకటన లేనప్పుడు, ప్రభావం లేకపోతే ఆలస్యం కారణంగా ఇటువంటి ప్రాజెక్టులు 'డిఫాల్ట్' అవుతాయి మరియు తద్వారా ఈ ప్రాజెక్టులపై విపరీతమైన ఒత్తిడిని కలిగిస్తాయి మరియు తరువాత రియల్ ఎస్టేట్ పరిశ్రమ మొత్తం పతనానికి దారితీస్తుంది. అటువంటి ప్రకటన పరిశ్రమకు మాత్రమే కాకుండా, వినియోగదారులతో సహా పాల్గొన్న అన్ని వాటాదారుల యొక్క పెద్ద ఆసక్తిని కలిగి ఉంటుందని మేము నమ్ముతున్నాము. నిర్మాణ పరిశ్రమ కోసం వైజగ్పటం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఈ క్రింది వాటిని పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నది.

## అరుణ్ జైట్లీ వర్ధంతి సందర్భంగా

## బీజేపీ కార్యాలయంలో జైట్లీ చిత్రపటానికి ఘన నివాళులు



విశాఖపట్నం : భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సోమ వారం బీజేపీ సీనియర్ నాయకులూ, కేంద్ర మాజీ మంత్రివర్యులు అరుణ్ జైట్లీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు ఎం. రవీంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్య క్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎం. రవీంద్ర మాట్లాడుతూ ఎబివిపి నుంచి వచ్చి అతి చిన్న వయసులోనే సొలిసిటేటర్ జనరల్గా పని చేసి దేశంలోనే ప్రముఖ న్యాయ వాదిగా ఉంటూ దేశానికీ, పార్టీకి ఎనలేని సేవ చేశారని అన్నారు.

వాజపేయి ప్రభుత్వంలోనూ, నరేంద్ర మోడీ ప్రభుత్వంలోనూ వివిధ శాఖలలో మంత్రిగా పనిచేసి ఆ శాఖలకే వన్నె తెచ్చారు అని తెలియజేశారు. ఆర్థిక మంత్రిగా గత ఐదు సంవత్సరాలలో దేశాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టడం జరిగిందని, బ్లాక్ మనీ ని అరికట్టడం లోనూ, డిమోనిటైజెషన్ చేయడంలోనూ, బ్యాంకింగ్ రంగాన్ని ప్రక్షాళన చేసి సామాన్యునికి అందుబాటులోకి తీసుకురావటం, చారిత్రాత్మక జిఎస్టి లాంటి సరళీకృత, ఏకీకృత పన్ను విధానాన్ని తీసుకువచ్చి ప్రపంచంలోనే భారతదేశాన్ని ఆర్థిక శక్తిగా ఎదగడంలో గొప్ప కృషి చేశారని అన్నారు.

## కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సిపిఎస్) రద్దు చేస్తానని

# ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలి

### యుటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ లక్ష్మి



అచ్యుతాపురం : కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సిపిఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ పథకం అమలు చేస్తానని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ లక్ష్మి డిమాండ్ చేశారు. యుటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షులు ఎన్ శ్రీనివాసురాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలపై మండల వనరుల కేంద్రం వద్ద నిరసన చేపట్టి ఎమ్ ఈఒ సిఆర్ కె దేవరాయల్ కి వినతిపత్రం అందజేసి అనంతరం ఎమ్ పిడిఒ కార్యలయం వద్ద నిరసన చేపట్టి సీనియర్ అసిస్టెంట్ ఎమ్ శ్రీనివాస్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 ను పున సమీక్షించాలని, బకాయి ఉన్న కరువు భత్యములను తక్షణం విడుల చేయాలన్నారు. పే రివిజన్ కమిషన్ 2018 (పిఆర్సి) ని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మురళికృష్ణ, అనూష, నీరజ, అనురాధ, సుభాషిణి దేవి, నిర్మల అధిక సంఖ్యలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కరోనా మహమ్మారి నుంచి మానవాళిని రక్షించు స్వామి..

### - శ్రీలక్ష్మి గణపతి హోమం ఘనంగా జరిపించిన విల్లూరి భాస్కరరావు



విశాఖపట్నం : కరోనా మహమ్మారి నుంచి.. మానవాళిని రక్షించాలని.. వేడుకుంటూ... కల్లుపాకల ప్రాంతంలో ఉన్న శ్రీ లక్ష్మి గణపతి ఆలయంలో ప్రముఖ సంఘ సేవకులు, ఆధ్యాత్మికవేత్త, వైసిపి మాజీ యువజన అధ్యక్షుడు, యువ నాయకుడు, వీఎంఆర్ ఫౌండేషన్ అధినేత విల్లూరి భాస్కరరావు..శ్రీలక్ష్మి గణపతి హోమాన్ని ఘనంగా జరిపించారు. వైరస్ బారి నుంచి సర్వ మానవాళిని కాపాడాలంటూ భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి సమర్పించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపించారు.

శ్రీ లక్ష్మి గణపతి ఆశీస్సులు, కరుణ కటాక్షాలు సర్వమానవాళిపై ఉంటాయని, కరోనా మహమ్మారి నుంచి వారిని రక్షిస్తాయని ఆయన భరోసా ఇచ్చారు. స్వామివారి దయవల్ల త్వరలోనే ప్రజ లందరూ ఆయురారోగ్యాలతో.. అష్ట ఐశ్వర్యాలతో.. సంతోషంగా ఉంటారని వ్యాఖ్యానించారు. ఆలయ ధర్మకర్త బొగ్గు శ్యామ్ మరియు అతని మిత్ర బృందం భక్తిశ్రద్ధలతో హోమంలో పాల్గొన్నారు.

## వాహనముల పర్మిట్లు, ఫిట్నెస్, డ్రైవింగ్ లైసెన్సుల కాలపరిమితి డిసెంబర్ 31 వరకు పొడిగింపు

విశాఖపట్నం : భారత ప్రభుత్వం కరోన వ్యాప్తిని కట్టడి చేసే ప్రక్రియలో లాక్ డౌన్ విధించడం జరిగింది. అందులో భాగంగా భారత ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం వాహనము యొక్క ఫిట్నెస్, అన్ని రకముల పర్మిట్లు , రిజిస్ట్రేషనులు, డ్రైవింగ్ లైసెన్సుల కాలపరిమితి 01. 02. 2020 నుండి ముగిసిన లేదా 31. 12. 2020 ముగియబోతున్న వాటికి డిసెంబర్ 31 2020 వరకు కూడా కాలపరిమితి పొడిగింపు ఇవ్వడం జరిగింది. రవాణా శాఖ మరియు పోలీసు శాఖ పైన పేర్కొన్న తేదీలలో కాలపరిమితి ఉన్న ఫిట్నెస్, అన్ని రకముల పర్మిట్లు , డ్రైవింగ్ లైసెన్సుల కాలపరిమితి డిసెంబర్ 31 2020 వరకు ఉన్నట్లు పరిగణలోనికి తీసుకోవాలి. అటువంటి వాటి పై కేసులు నమోదు చేయరాదని తెలియ జేయడమైనది.

ప్రజలందరూ ఇది గమనించవలసినదిగా రాగుంటు ఉప రవాణా కమిషనర్ తెలియజేయడమయింది.



నగరానికి విచ్చేసిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణను మర్యాదపూర్వకంగా కలుసుకుని కుశల ప్రశ్నలు వేస్తూ, నగర అభివృద్ధిలో తమ సహాయ సహకారాలు అందించాలని మాట్లాడుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం

# విజయభాను సంపాదకీయం

## ప్రజా శ్రేయస్సుకే భూ సంస్కరణలు

తమిళంలో ఒక రామాయణం వుందట. ఆ రామాయణం రచించిన కవిఒక చక్కని మాట రాశాడట. ఒక చిన్న రైతు తన భూమిని ఎంత బాగా రక్షించుకొంటాడో అట్లాగే దశరథ మహారాజు తన రాజ్యాన్ని చూచుకొనేవాడు అని ఒక ఉపమానం ఇచ్చాడు. అందుకని భూ సంస్కరణలకు బీజారోపణ రామాయణ కాలంలోనే జరిగిందని చెప్పడానికి నేను సాహసిస్తున్నాను. ఒక చిన్నరైతు వ్యక్తిగత శ్రద్ధాసక్తులతో తన చిన్న కమతాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకోవడానికి వీలవుతుందో జమీందార్లకు, పెద్ద భూ స్వాములకు వీలు కాదు. భూకమతాలు ఎంత వుండాలి. పరిమితి ఎంత వుండాలి? ఎంత ఆదాయం అందులో వచ్చేటువంటిదిగా వుండాలి? దానిపైన మనం ఏయే ఆంక్షలు విధించాలి? ఇంకా ఏమేమి నియమావళి తేవాలి? యావదాంధ్ర దేశంలో ఇంటింటా, ఊరూరా భూమి వున్నవారికి, లేనివారికి, కొద్దిగా ఉన్నవారికి, గొప్పగా ఉన్నవారికి అందరికీ ఏదో ఒక రకమైన ఉత్సాహాన్ని, ఒక విధమైన ఆందోళనను రెండింటినీ కలిగిస్తున్న ఈ సమస్య, ఏదో ముఖ్యమంత్రి తనింట్లో కూర్చుని, తన ఆఫీసులో కూర్చుని తలుపులు బిగించుకొని తయారు చేసినటువంటి చట్టం వల్ల తేలిపోయేది కాదు. వేలాది, లక్షలాది జనానీకాన్ని ఇంత ఉత్సాహవంతులను చేసినటువంటిది. ఇందరు ఇంటింటా చర్చించుకుంటున్నటువంటి సమస్యపైన ఒక చట్టం చేయాలంటే దానికి ఒక రాష్ట్రవ్యాప్తమైనటువంటి 'డయలాగ్' అవసరం, ఒక చర్చ అవసరం.

కాలయాపన వల్ల ప్రమాదం: కానీ ఇందులో ఒక బాధ వుంది. మనమందరమూ చర్చించుకుంటూ వుంటే జాగ్రత్తపడేవాళ్ళు జాగ్రత్తపడుతూ వున్నారు. పంజాబులో అక్కడి ముఖ్యమంత్రిగారు ఒక మాట చెప్పినారు మొన్న. ఏమంటే, అంతా వేరే వేరే పేర్లపైన భూములన్నీ వ్రాసుకుంటే, పంపిణీ ఎంక్వయిరీ చేయడానికి పోతే కొన్ని పేర్లు దొరికినాయట. ఆ పేర్లు గల వ్యక్తులు ఆ వూరిలోనే లేరు. అరే! ఈ పేరుగలవారు పక్క వూరిలో ఏమైనా వున్నారా? అని బాగా తరచి తరచి పరిశీలిస్తే చివరకు తేలిందేమంటే, ఆ యజమానిగారి పెంపుడు కుక్క పేరు 'కల్లూ' అనివుంటే ఆ కల్లూ పేరు వ్రాశేశారన్న మాట! మనుషుల పట్టాలు పోయినాయి కాని పిల్లులకు, కుక్కలకు పట్టాదారి అనేటువంటిది కల్పించి ఈ విధంగా పంచుకోవడం జరిగింది. భారతదేశం అంతటా జరిగింది. ఆంధ్రదేశంలో కూడా జరిగింది. అందులో ఏలాంటి సందేహమూ లేదు. ఇదివరకు జరిగినదానిని ఏమి చేయాలో, దాన్ని ఎలా రద్దు చేయడమో అనేదానిని గురించి చట్టంలో వేసుకున్నాము గాని, ఈ చట్టాన్ని గురించి మనం ఆలోచించిన కొద్దీ ఇది గండి పెట్టుకొనిపోతూ వుంటే, మనం గండి బాగుచేసేలోపల చెరువులో నీరు లేకుండా పోతుంది! అందుకని మనం ఏం చేయాలంటే, గండిపోయిన తర్వాత, రింగ్ బండ్ అని మొదలేస్తాం. దీన్నే పురికట్ట అంటారు తెలంగాణలో. కొద్దినీళ్ళయినా నిలిపి ఒక పంటయినా దక్కించుకోవడానికి. కొంత భూమి అయినా ఆగాలని వేసినటువంటి పురికట్ట వంటిది ఈ ఆర్డినెన్స్. ఇది అసలు ముఖ్యంగా తరువాత జరుగబో యేటు వంటి దానికి మనం ఇచ్చినటువంటి సపోర్టు అని చెబుతున్నాను. మీరు ఎన్ని చట్టాలు చేస్తే మాత్రం ఏమిటి? చట్టాలు చేసే లోపల, మరి వీళ్ళంతా ఎక్కడిదక్కడ సర్దుబాటు చేసుకున్న తర్వాత మనం చట్టం అమలు చేయడానికి ఏమీ దొరక్కపోతే ఎలా?


1961లో మొట్టమొదటిసారిగా భూ కమతాల మీద, గరిష్ట పరిమితి చట్టం వచ్చిననాడు ఎవ్వరికీ చీమకుట్టినట్టుగా కూడా లేదు. అప్పుడు ఆంధ్రప్రదేశంలో సభలు లేవు, చర్చావేది కలు లేవు, ఏమీ లేవు. చల్లగా ఏదో చేసేశారు. అందరూ మరచిపోయారు. దాన్ని గురించి పట్టించుకున్నవాళ్ళు లేరు.

ఇప్పుడే ఎవరో అడిగారు, మీకు ఎంత మిగులు భూమి వస్తుంది అని. ఈ ఆర్డినెన్స్ గనుక రాకపోతే వెంటనే జవాబు చెప్పి వుండేవాణ్ణి-సున్నా అని. ఆర్డినెన్స్ వచ్చింది కాబట్టి సందేహిస్తున్నాను. ఎంత భూమి వస్తుందో లెక్కలు వేసి చెప్పమని అధికారులకు చెప్పినాము. వారు తప్పకుండా చెబుతారు. బహుశా ఏ రాష్ట్రములోనైనా, నీ మిగులు భూమి ఎంత అని అడుగుతే, గుండె మీద చెయ్యి వేసుకొని కచ్చితంగా చెప్పగలిగిన ముఖ్యమంత్రి ఎవరైనా వున్నారంటే అది ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రమే అని చెప్పగలుగుతారు.

దేశానికీ పార్టీకి ఎటువంటి సమస్య ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనే సత్తా

# గాంధీ సభ్యులదే

### నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంకు వెంకటేశ్వర రావు



మురళీనగర్: దేశం క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొం టున్న తరుణంలో కాంగ్రెస్ బలమైన విపక్షం గా నిలబడాలంటే సోనియా గాంధీ లేదా రాహుల్ గాంధీ లే పార్టీకి నాయకత్వం వహించాలని విశాఖపట్నం కాంగ్రెస్ నగరాధ్యక్షుడు సంకు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు.బీజేపీ ని ధీటుగా ఎదుర్కోవాలంటే గాంధీ కుటుంబసభ్యులే తగిన వారని సంకు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దేశం తీవ్ర ఆర్థిక,రాజకీయ,సామజిక ఎదుర్కుంటోందని ఈ సమయంలో దేశప్రజలకు అండగా నిలవగలిగే విధంగా పార్టీని సమర్థంగా నడపాలంటే దేశమంతా చిరపరిచితమైన నాయకుడు కావాలని దానికి సోనియా,రాహుల్ మాత్రమే అర్హులని సంకు తెలిపారు.నిస్వార్థంగా పనిచేసే సోనియా,రాహుల్ లను పక్కనపెట్టి పార్టీని నడిపించడం దాదాపు అసాధ్యమని సంకు అభిప్రాయపడ్డారు. ప్రధాని పదవి కి అవకాశంవచ్చినా తృణప్రాయంగా తిరస్కరించి మన్మోహన్ సింగ్ నాయకత్వాన్నిబలపరిచి దేశాన్నిసమర్థంగా పాలించేలా సూచనలు చేసారని కొనియాడారు.

కాంగ్రెస్ కార్యకర్త లేని గ్రామం దేశంలో లేదని దీనికి గాంధీలే కారణమని తెలిపారు. కొంతమంది అవకాశవాదులు లేఖలు పట్టించుకోవాల్సిన పనిలేదని, లేఖలు రాసిన వారు ఈ రెండేళ్లలో చేసిందేమిటో చెప్పాలని సంకు డిమాండ్ చేశారు.

దేశానికీ, కాంగ్రెస్ పార్టీకీ ఏ సమస్య వచ్చినా సమర్థంగా ఎదుర్కొనగలిగే సత్తా గాంధీ కుటుంబసభ్యులకు ఉందని సంకు అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా సామాన్య కార్యకర్తలందరూ సోనియా,రాహుల్ గాంధీల నాయకత్వాన్ని బలపరుస్తున్నారని సంకు తెలిపారు.

# ప్రాజెక్టులకు తగ్గిన వరద ప్రవాహం



హైదరాబాద్ : పది రోజులుగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద, భారీ వర్షాలతో కృష్ణా పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కాగా, రెండు రోజుల నుంచి వర్షాలు కాస్త తగ్గడంతో క్రమంగా వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. దీంతో శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు నీటి ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. దీంతో గేట్ల నుంచి నీటి విడుదలను అధికారులు తగ్గిస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో 2,88,230 క్యూసెక్కులు ఉండగా అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎనిమిది గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 2.19లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచి పెడుతున్నారు.

జలాశయం పూర్తి సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటి నిల్వ 208.28టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మరోవైపు నాగార్జున సాగర్ వద్ద కూడా నీటి విడుదలను అధికారులు క్రమంగా తగ్గిస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌కు 1.54లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో ఎనిమిది గేట్లు పది అడుగుల మేర ఎత్తి 1.15లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం మొత్తం 590 అడుగులకు గాను ప్రస్తుతం 587 వద్ద నియంత్రణ చేస్తున్నారు. సాగర్ పూర్తి నీటి నిల్వ 312.04టీఎంసీలు కాగా, ప్రస్తుతం సాగర్‌లో 305.50 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గోదావరికి తగ్గిన వరద ప్రవాహం..

భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం తగ్గడంతో భద్రాలచంలో గోదావరి నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. సుమారు 12 అడుగుల మేర నీటి మట్టం తగ్గినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం వరకు 42.6 అడుగుల వద్దకు నీటి మట్టం చేరుకుంది. నీటి మట్టం తగ్గడంతో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించుకున్నారు.

# సదుపాయాలు కల్పిస్తాం మెరుగైన సేవలు అందించండి



శ్రీకాకుళం : ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కోవిడ్ విభాగంలో సౌకర్యాలు కల్పిస్తామని మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ జె నివాస్ డాక్టర్లను కోరారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యులు, పిజి వైద్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రిలో చేరిన ప్రతి ఒక్కరికి మంచి వైద్యం అందాలని ఆయన పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించుటకు సిద్ధంగా ఉన్నామని అయితే ఆయా విభాగాలకు చెందిన వైద్యులు పూర్తిగా అంకితభావంతో పనిచేసి మంచి వైద్య సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రిలో చేరిన ప్రతి ఒక్కరు సంతృప్తితో ఉండాలని అన్నారు. కోవిడ్ నుండి పూర్తిగా కోలుకుని ఇంటికి వెళ్లాలని ఆయన చెప్పారు. కరోనా విషయాలను పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి మానసిక స్థైర్యాన్ని నింపాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల అవసరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు స్పందిస్తూ అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొన్ని విభాగాలకు సంబంధించిన యంత్ర పరికరాలు కొంత మేరకు అవసరం ఉందని వాటిని సమకూర్చాలని కోరారు. ప్రతిరోజూ 20 నుండి 30 కేసులు ఆస్పత్రికి వస్తున్నాయని వాటిలో దాదాపు ఐదు కేసులు చివరి దశలు ఉన్నవి వస్తున్నాయని వివరించారు. అదే విధంగా ఎం.ఎన్. ఓలు, ఎఫ్. ఎన్. ఓ లకు విభాగాలలో నియామకాలకు ముందు తగిన శిక్షణ కల్పించాలని ఆయన సూచించారు.

## భీమిలి నియోజకవర్గ రెండో డివిజన్ బీజేపీ అధ్యక్షుడుగా గుజ్జు రాము

భీమునిపట్నం : భారతీయ జనతా పార్టీ భీమిలి నియోజక వర్గం రెండో డివిజన్ భాజపా అధ్యక్షుడు గా గుజ్జు రామును నియమించారు. జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో...

పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర రెడ్డి రాము మెడలో పార్టీ కండువా కప్పి రెండో డివిజన్ అధ్యక్షుడు గా ప్రకటించారు.

భాజపా సీనియర్ నాయకులు ఉప్పాడ అప్పారావు జిల్లా కార్యధర్శి వాసుపల్లి శ్రీహరి, మాజీ మహిళా మోర్చా శిరపు. రామలక్ష్మి ఆయనకు అభినందనలు తెలియ జేశారు.

ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ జిల్లా పార్లమెంటు అధ్యక్షులు రవీంద్ర రెడ్డి , మాజీ పార్లమెంటు సభ్యులు హరిబాబుశాసనమండలి సభ్యులు పివీఎన్ మాధవన్, రాష్ట్ర కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథ్ రాజు ,భీమిలి ఇన్చార్జ్ కె.ఎన్.పి చక్రవర్తి , కోరాడ శంకర్ రావు,కంటుబుక్త రామానాయుడు మార్గదర్శనంలో ముందుకెళతానని, స్థానిక నాయకులతో కలిసి పార్టీను బలోపేతం చేయుటకు కృషిచేస్తా నని అన్నారు.

## ఇఎస్ఐ ద్వారా కరోనా చికిత్స సెంటర్ ఏర్పాటు చేయాలి

### - సిఐటియు డిమాండ్

విశాఖపట్నం : ఇఎస్ఐ కార్పొరేషన్ ద్వారా విశాఖలో కరోనా చికిత్స సెంటర్ వెంటనే ఏర్పాటు చేయాలని సిఐటియు విశాఖనగర కమిటీ డిమాండ్ చేస్తున్నది. ఉత్తరాంధ్ర జిల్లాల ఇఎస్ఐ పరిధిలో సుమారు 5లక్షల మంది ఇన్సూర్డ్ పెరసన్స్ వీరి కుటుంబ సభ్యులతో కలుపుకొని సుమారు 20లక్షల మంది లబ్ధిదారులున్నారు. కరోనా మహమ్మారి ఈ మూడు జిల్లాల్లో రోజు రోజుకూ విజృంభిస్తున్నది. కార్మికులు, కుటుంబాలు అనేక మంది కరోనా బారిన పడి సరైన వైద్యం అందక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇఎస్ఐ ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. కార్మికులు, యజమానుల నుండి కోట్లాది రూపాయలు ప్రతినెల ఇఎస్ఐ వసూలు చేస్తోంది. ఇఎస్ఐ లబ్ధిదారుల ఆరోగ్యం సంక్షేమం ఎడల నిర్లక్ష్యంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. సంపద సృష్టిస్తున్న కార్మికుల ఎడల ఈ నిర్లక్ష్యాన్ని విడనాడి ఇఎస్ఐ లబ్ధిదారుల కోసం విశాఖలో ప్రత్యేకంగా కరోనా చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. లేని ఎడల ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నాము.అదే విధంగా ప్రస్తుత ఆసుపత్రి, డిస్పెన్సరీలలో ఇతరులకు వైద్యం అరకొరగా అందుతున్నది. ఇఎస్ఐ తో టై అప్ ఉన్న గీతం వంటి ఆసుపత్రుల్లో ఇఎస్ఐ లబ్ధిదారులకు వైద్యం అందడంలేదు. మరిన్ని ఆసుపత్రులతో టైఅప్ కుదుర్చుకోవడం ద్వారా కార్మికుల ఇబ్బందుల తీర్చాలని కోరుతున్నాము.

## ఫ్యాక్టరీ కార్మికుడికి ఏవో రమణమూర్తి చేతుల మీదగా చెక్కు పంపిణీ



ఫ్యాక్టరీ యూనియన్ నాయకులతో కలిసి చెక్కును అందజేస్తున్న ఏవో రమణమూర్తి

చోడవరం : చోడవరం సహకార చక్కెర కర్మాగారం లో పదవి విరమణ పొందిన ఉద్యోగి, ఫీల్డ్ మాన్ సిరిపురపు సత్యనారాయణకు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోదరుడు, ఫ్యాక్టరీ ఏవో పప్పల రమణమూర్తి చేతుల మీదుగా గ్రాట్యుటీ చెక్కును సోమవారం అందజేశారు. షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ (గుర్తింపు) యూనియన్ అధ్యక్షా, కార్యదర్శులు రాయి సూరిబాబు, శరగడం రామునాయుడు ఆధ్వర్యంలో మూడు లక్షల 15 వేల రూపాయల చెక్కును రమణమూర్తి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వి రమణ రాజు (వర్మ) వేగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైవాడ కాలువ పూడికతీత పనులు ముమ్మరం

### - జివిఎంసి కు నీటి సరఫరా నిలుపుదల



దేవరాపల్లి : మహా నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీరు అందించే రైవాడ కాలువ పూడికతీత పనులు కొనసాగుతున్నాయి.దీని కారణంగా ఈ నెల 5 నుంచి జీవీఎంసీ కి తాగునీటి సరఫరా ను నిలుపుదల చేశారు. దశాబ్ద కాలంగా పూడికతీత పనులు నిర్వహించకపోవడంతో 18 ఎం జీ డీ ల నీటిని విడుదల చేస్తున్నా, నగరానికి 12 ఎం జీ డీలు మాత్రమే రావడంతో నగర అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు 56 కిలోమీటర్ల కాలువ పూడికతీత పనులు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ జి. సృజన నిర్ణయించారు. ఆమె సూచనల మేరకు రూ. 1.96 కోట్లతో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ పనులను జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఎస్ ఈ వేణుగోపాల్ పర్యవేక్షిస్తున్నారు. జలాశయం నుంచి కాలువకు నీరు నిలుపుదల చేయడంతో పూడికతీత పనులు యుద్ధప్రాదిపదికన జరుగుతున్నాయి.

బీజేపీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో

# అరుణ్ జైట్లీ వర్ధంతి



భీమునిపట్నం: భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో 3 వార్డు అధ్యక్షుడు లయన్.డాక్టర్.సత్తరవు వాయునందనరావు ఆధ్వర్యంలో అరుణ్ జైట్లీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కోరాడ శంకర్రావు మాట్లాడుతూ అరుణ్ జెట్లీ 2014 మోడీ గవర్నమెంట్ లో ఆర్థిక శాఖ మినిస్టర్ గా ఎన్నో సేవలు అందించడం జరిగిందని , అంతే కాదు ఆయన ఆర్థిక శాఖ మినిస్టర్ గా ఉండగా జి ఎస్ టి బిల్లు, నోట్లు మార్పిడి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 3 వార్డు జనరల్ సెక్రెటరీ రాజ్ పురోహిత్ కుమార్, ముమ్మడిశెట్టి సునీల్, సి హెచ్ సుబ్బారావు , కె.రాజారావు, పి.రాజేంద్ర ప్రసాద్, ఎస్.మహేష్, కోశాధికారి పి.భరత్ కుమార్ తదితరులు పాల్గొని ఆయనకు నివాళులు అర్పించారు.

## మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు ప్రభుత్వ ఆమోదం

అమరావతి: నాణ్యమైన బియ్యం పంపిణీపై మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం ఆమోదించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రైస్ కార్డు ఉన్న పేదలకు నాణ్యమైన సోర్టెక్స్ బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు గాను 9,260 ప్రత్యేక వాహనాల ద్వారా బియ్యాన్ని ఇంటింటికీ డోర్ డెలివరీ చేయాలని నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపింది. బియ్యం సరఫరాకు గాను ప్రభుత్వం రీయూజబుల్ సంచులను పంపిణీ చేయనుంది.

## అమరావతి రైతులకు అండగా ఏపీ సర్కార్

తాడేపల్లి : అమరావతి రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తప్పక న్యాయం చేస్తుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మరోసారి స్పష్టం చేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రైతులను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఆయన ట్రాప్‌లో పడొద్దని అమరావతి రైతులకు సూచించారు. స్థానిక రైతులను అండగా ప్రభుత్వం ఉంటుందని, వారికి ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా ప్రభుత్వంతో చర్చించవచ్చని తెలిపారు. రాజధాని ప్రాంతంలో జరిగే ఉద్యమానికి దళితులకు సంబంధం లేదని స్పష్ట చేశారు. రాజధాని భూములపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టీడీపీ నేతలు విమర్శించడం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డొక్కా మణిక్యవర ప్రసాద్ మాట్లాడుతూ.. దళితులకు ఇళ్ల పట్టాలు రాకుండా అడ్డుకున్న చంద్రబాబు నాయుడుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మద్దతు తెలపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అమరావతిలో దళితులకు 52 వేల ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా టీడీపీ నేతలు కోర్టులో కేసులు వేశారని మండిపడ్డారు. కేసులు వేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కోర్టు సుమోటుగా స్వీకరించి విచారణ జరపాలని ఆయన కోరారు.

## దేశపాత్రునిపాలెంలో గోగ్రిల్స్ షాపు ప్రారంభం

**ముఖ్యఅతిథిగా కాసు అంజిరెడ్డి హాజరు**



పరవాడ : జివియంసి 79వ వార్డులో గల దేశపాత్రుని పాలెంలో గోగ్రిల్స్ షాపును స్థానిక వైసీపీ నాయకులు, అధీప్‌రాజ్ గ్రీన్‌ఆర్మీ వ్యవ స్థాపకుడు కాసు అంజిరెడ్డి హజరై అయన చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో వెన్నల శివ, పిల్లా సతీష్, ఎన్.వినోద్, పూడి సతీష్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## నిరాడంబరంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ సోదరుడు రమణమూర్తి జన్మదిన వేడుకలు



చోడవరంలో షటిల్ టీమ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే సోదరుడు రమణమూర్తి

చోడవరం : చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోదరుడు పప్పల రమణ మూర్తి జన్మదిన వేడుకలు సహచరులు, స్నేహితులు, అబిమానులు మధ్య సోమవారం నిరాడంబరంగా జరిగాయి. సహృదయుడు, స్నేహశీలి అయిన రమణ మూర్తి పుట్టినరోజు వేడుకలు సందర్భంగా చోడవరం పట్టణంలో పలుచోట్ల ఆయనచే కేక్ కటింగ్ నిర్వహించి అభిమానులకు పంచిపెట్టారు. షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ నాయకులు, కార్మికులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చోడవరంలో షటిల్ టీం సభ్యులు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చోడవరం సీఐ కరణం ఈశ్వరరావు, దొడ్డి కిషోర్, పి చిరంజీవి, రవి, జి సతీష్, సత్తిబాబు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

## ఐక్య ఉపాధ్యాయ సంఘం యూటిఎఫ్ ఆధ్వర్యంలో పరవాడలో నిరసన




పరవాడ : ఐక్య ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా ఇచ్చిన పిలుపు మేరకు అన్నీ పట్టణ, మండలంలో కేంద్రాల్లో చేసే నిరసనలో భాగంగా సోమవారము పరవాడలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లడుతూ జాతీయ సమైక్యత జాతి పురోభివృద్ధి విద్యార్థులందరికీ జాతీయ సార్వత్రిక విద్యను అందించే బలోపేతమైన అంశాలును చేర్చి ప్రభుత్వము అదిశులుగా అడుగూలు వేయాలనీ రాష్ట్ర ముఖ్య మంత్రి ఇచ్చిన హమీలులో కంట్రీ బ్యూటర్ పెన్షన్ రద్దు చేసీ పాత పెన్షన్ అమలు చేయాలనీ డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యూని యన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా సమయంలో పేదలను ఆదుకోవాలి



నిరసన తెలియజేస్తున్న దృశ్యం

గొలుగొండ : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కరోనా సమయంలో పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సభ్యులు నెల్లూరి చిరంజీవి మాట్లాడుతూ కరోనా సమయంలో కుటుంబంలో ప్రతి ఒక్కరికి 10కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని కల్పించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు.

అనంతరం పంచాయితీ కార్య దర్శి నాగేంద్రకుమార్‌కి వినతిపత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు వెంపాటి లోవరాజు, మూసిలిరావు, అప్పారావు,రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

## విస్సన్నపేట ప్రజల రహదారి కష్టాలు తీర్చిన బురదరాజు

**- ముఫ్పైవేలు రుపాయల సొంతనిధులు వెచ్చించి రహదారికి మరమ్మత్తులు**

**- ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన విస్సన్నపేట గ్రామ ప్రజలు**



పరవాడ : పరవాడ మండలము చీపురుపల్లి పంచాయితీ పరిదిలో గల చీపురుపల్లి నుండి విస్సన్నపేటకు వెళ్ళే రోడ్డు మరమ్మత్తుకు గురికావడముతో అగ్రామ ప్రజలు ఊరులోకే వెళ్ళే కష్టాలును చూసి వాడచీపురుపల్లి వైసీపీ కన్వీనర్ బురద రాజు చలించిపోయి రహదారి మరమ్మత్తు చేపట్టునందుకు అయన నడుం బిగించారు. ముప్పైవేలు రూపాయాలు సొంత నిధులు వెచ్చించి విస్సన్నపేట రహదారికి మరమ్మత్తులు చేపట్టి దగ్గరుండి పనులు పూర్తి చేయించారు. ఈయన చేపట్టిన కార్యక్రమానికి విస్సన్నపేట గ్రామ ప్రజలు బురదరాజుకు ప్రత్యక కృతజ్ఞతలు తెలిపారు. ఈరహదారి మరమ్మత్తులు పనులు పరిశీలనలో అయనతో పాటు వైసిపి కన్వీనర్ కూండ్రపు తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్‌పిడిఓ వెంకటరమణకు టీడీపీ కోర్ కమిటీ పలు డిమాండ్ల పై వినతిపత్రం



భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కోర్ కమిటీ సభ్యులు నియోజకవర్గ ఇంచార్జి సబ్బం హరి క్యాంపు కార్యాలయం లో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన డి.ఏ.ఎన్. రాజు మాట్లాడుతూ వై.ఎస్. ఆర్.సి.పి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అరాచ కాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని అన్నారు. తీసుకున్న నిర్ణయాలకు, చేస్తున్న పనులకు పొంతన లేకుండా చేస్తున్నారని. ఏ పనిచేసినా ప్రజాభిప్రాయతో సంబంధం లేకుండా చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు ఈ మధ్యకాలంలో భీమిలి మండల పరిషత్ కార్యాలయంను తొలగించే తీరు భీముని పట్నం ప్రజలందరిని అయోమయానికి గురిచేస్తుందని అన్నారు. సుమారుగా 70 సంవత్సరాల చరిత్ర కలిగిన సమావేశ మందిరమును, కార్యాలయంను రాత్రికి రాత్రి తొలగించారని, స్థానిక పాలకపక్షం కూడా లేనప్పుడు, కనీసం అఖిల పక్షం కూడా ఏర్పాటు చేయకుండా తొలగించడం సరైన నిర్ణయం కాదని అన్నారు. ఏదైనా భవనం శిథిలావస్థకు చేరితే ముందుగా కొత్త భవనముకి నిధులు మంజూరు చేసుకొని, ప్లానింగ్ చేసుకొని అనంతరం పాత భవనంను తొలగిస్తారని అన్నారు తక్షణమే పాత భవనం స్థానంలో కొత్త భవనంను పునఃర్మించాలని డి.ఏ.ఎన్ రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు కోర్ కమిటీ సభ్యులు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పాశర్ల ప్రసాద్ మాట్లాడుతూ. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఆరాచకాలే ఆయుధంగా మారిందని అన్నారు. ప్రతిపక్ష సభ్యులను బెదిరించడం, అనవసరంగా కేసులు పెట్టి వేదంచడం అలవాటయిందని అన్నారు. కోవిడ్ సందర్భంగా యావత్ ప్రజలందరూ నానా అవస్థలు పడితే టీడీపి సభ్యులు నిత్యావసర వస్తువులు సామాన్యులకు పంచితే కేసులుపెట్టి బెదిరించారని, అదే అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా తిరిగి గుంపులు గుంపులుగా తిరిగినా వారిపై ఎటువంటి చర్యలు లేవని అన్నారు. అధికార పార్టీ వారు ఎన్ని బెదిరింపులకు పాల్పడినా తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని చెప్పారు కోర్ కమిటీ సభ్యులు భీమిలి డివిజన్ టిడిపి అధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడుతూ... నాడు - నేడు అని చెప్పి వైఎస్ఆర్‌పార్టీ నాయకులకు నామినేటెడ్ వర్కులు ఇవ్వడం కోసం పక్కా భవనాలను కూడా తొలగిస్తున్నారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా 15 నెలల సమయంలో ఒక లక్షా తొమ్మిది వేల రూపాయలు అప్పు చేశారని, కానీ ఎక్కడా ఎటువంటి అభివృద్ధి జరగలేదని అన్నారు కేవలం సంక్షేమ పథకాలు పేరిటా ప్రజలను మోసం చేయాడంలో జగన్మోహన్ రెడ్డి ని మించిన వారు మరొకరు ఉండరని చెప్పారు. మూడు రాజధానుల పేరిటా ఐదున్నర కోట్ల ఆంధ్రులను సంక్షోభంలోకి నెట్టివేసి గందరగోళానికి గురిచేసారని అదేవిధంగా భీమిలి రూరల్ మండలాలు అయిన మూలకుద్దు, రేఖవాని పంచాయతీలను అటు జి.వి.ఎమ్.సి.లో కలపకా, ఓటు పంచాయితీలుగా ఉంచకా వీటిని ఏమి చేద్దామను కుంటున్నారని, అనంతరం కోర్ కమిటీ సభ్యులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వరకు నడుచుకుంటూ వెళ్లి ఎమ్ డి.ఓ. వెంకటరమణకు పలు డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు గాడు అప్పలనాయుడు, గొల్లంగి ఆనందబాబు, దాసరి శ్రీను, తెలుగుదేశం పార్టీ నాయకులు గరికిన పరశురాం, మాజీ జెడ్పీటీసీ సరగడ అప్పారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

## కానరాని వినాయకచవితి సంబరాలు

**- తెలుగువారి తొలి పండుగ కు కరోనా దెబ్బ**

**- ఇళ్ళకే పరిమితమైన గణపతి పూజలు**



దేవరాపల్లి : వినాయకచవితి వస్తుందని నెల రోజులు ముందు నుంచే పట్టణాలు మొదలుకొని, గ్రామీణ ప్రాంతాల వరకు ఒకటే హడావడి. పిల్లలు, యువకులు, పెద్దలు, మహిళలు అన్న తారతమ్యం లేకుండా... స్వామి వారి భక్తిలో మునిగి తేలేవారు. తెలుగు వారి తొలి పండుగ వినాయకచవితి ఘనంగా జరుపుకోవాలని పోటీ పడి భారీ మండపాలు నిర్మించి, రంగురంగుల విగ్రహాలు ఏర్పాటు చేసి, డీజే సౌండ్ లతో అదరగొట్టేవారు. తొమ్మిది రోజులు పాటు నిత్య పూజలు జరిపి నిమజ్జనం అయ్యంతవరకు నిద్రహారాలు మాని జాతర చేసేవాళ్ళు... ప్రస్తుతం కరోనా కారణంగా నాటి పరిస్థితి నేడు ఎక్కడ కానరాలేదు. అన్నీ ప్రాంతాల్లో కరోనా కేసులు విపరీతంగా పెరుగుపోవడంతో పోలీసులు, అధికారులు వినాయకచవితి ఇళ్ళ వద్దనే చేసుకోవాలని హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు పోలీసులు నియమాలను తూ. చ పాటించారు. ఈ ఏటా గణపతి పూజలు మండలంలోని పలు వినాయక ఆలయాల్లో సాంప్రదాయ బద్ధంగా పూజలు జరిపారు. కొంత మంది భక్తులు ఇంటి వద్ద భక్తి శ్రద్ధలతో వినాయకునికి పూజలు చేశారు. అనంతరం సమీపంలోని కాలువ, చెరువుల్లో వినాయకుణ్ణి ఎటువంటి హంగామా లేకుండానే నిమజ్జనం తంతు ముగించారు.ఇదిలా ఉండగా ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలు కొనుగోలు చేయడంతో రంగుల విగ్రహాలు అమ్మే వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.

## వైఎస్ఆర్ చేయూత దివ్యాంగుల పథకం ఏర్పాటు చేయాలి



అచ్యుతాపురం : వైఎస్ఆర్ చేయూత దివ్యాంగుల పథకం ఏర్పాటు చేసి దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీ స్వామి వివేకానంద వికలాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు నూకరాజు కోరారు. సోమవారం ఆయన సంఘ సభ్యులతో కలిసి దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలని అనకాపల్లి ఆర్ డి ఒ కార్యలయంలో వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు సంక్షేమ పథకాలు బాగా అందుతున్నాయన్నారు. దివ్యాంగులకు నెల పింఛన్ తో పాటు ప్రభుత్వం ద్వారా రాయితీ పథకాలు అందించాలన్నారు. ప్రస్తుతం దివ్యాంగులు ఎక్కడికి వెళ్లలేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ చేయూత దివ్యాంగుల పథకం ఏర్పాటు చేసి దివ్యాంగు లను ఆదుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వై ఎర్రయ్య, ఎమ్ నూకరాజు, వి.మసేను, కె లక్ష్మి తదితరులు ఉన్నారు.

## ఎరువులు కొరతను వెంటనే నివారించాలి

**- రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి**

**- పిఏసిఎస్ ల వద్ద సీపీఎం ఆందోళన**



దేవరాపల్లి : జిల్లాలోని రైతాంగానికి సరిపడా యూరియా ను సరఫరా చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి సిహెచ్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. దేవరాపల్లి పి ఏ సి ఎస్ వద్ద రైతులుతో కలిసి సోమవారం ఆందోళన చేశారు. అనంతరం వారు మాట్లాడారు జిల్లాలోని ఎరువులు కొరత తీవ్రంగా ఉందని, రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేయడం లేదని అన్నారు. ప్రభుత్వం సొసైటీల ద్వారా 270 రూపాయలకు ఎరువులు అమ్మితే బయట మార్కెట్ లో 300 నుంచి 350 వరకు అమ్ముతున్నారని తెలిపారు. ఎకారాకు 3 బస్తాలు యూరియా అవసరం అయితే ఎన్ని ఎకారాలు ఉన్న ,ఆధార్ కార్డు పై ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. జిల్లాలోని కశింకోట, యస్ రాయవరం, రాంబిల్లి, అనకాపల్లి, మునగపాక, అచ్చుతాపురం బుచ్చయ్యపెట ,వి మాడుగుల చోడవరం, చీడికాడ దేవరాపల్లి, కె కోటపాడు మండలాల్లో ఎరువులు కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. చోడవరం మండలం గజపతి నగరం సొసైటీలో కరోనా కారణంగా తెరవక పోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కరోనా సమయంలో బస్తా యూరియా కోసం రోజుంతా ఎండలో పనులు మానుకోని నిలబడవలసి వస్తుందని అన్నారు. ఇలగైతే కరోనా వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈబాధ పడలేక రైతులు ప్రేవేటు వ్యాపారులు వద్ద అధిక ధరలకు ఎరువులు ,కోనుగోలు చేస్తున్నారని అన్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలని రైతు భరోసా గ్రామసచివాలయాలు నుంచి రైతులకు ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో అధికసంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవన్ మాజీ అధ్యక్షుడు రాఘవేంద్రరావు ఆకస్మిక మృతి



అంబేద్కర్ భవన్ మాజీ అధ్యక్షుడు రాఘవేంద్ర రావు హెచ్ పీ లో జనరల్ మేనేజర్ గా పనిచేసి ఇ రిటైరయ్యారు ఆయన ప్రముఖ అంబేద్కర్ ఈ లు దళితుల దళితుల జనోద్ధరణ కోసం విశేషంగా కృషి చేసి అందరి మన్ననలు పొందారు అయితే ఆయన నిన్న సాయంత్రం అకాల మరణం చెందారు ఆయన ఎంఎస్ సంస్థకు కాలేజీకి కరస్పాండెంట్ గా పని చేస్తున్నారు అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని అంతేకాకుండా దళితులకు వారి అభ్యున్నతికి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ కుమార్ పేర్కొన్నారు జిల్లా జడ్జి కోర్టు ఎదురుగా గల బివికె ఛాంబర్స్‌లో జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ అంతేకాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా దళితులకు అన్యాయం జరిగితే దానిపై వెంటనే స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన ఘనత రాఘవేంద్రరావుకి దక్కుతుందని ఆయన మరణం దళితులకు బడుగు బలహీన వర్గాలకు తీరనిలోటని కొనియాడారు ఈ కార్యక్రమంలో లో రాష్ట్రపతి అవార్డు గ్రహీత మహమ్మద్ న్యాయవాదులు కోటేశ్వరరావు శశికళ డాక్టర్ బోసు బాబు, కుంచె మధు గూడె పల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక స్థోమత లేని ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం

### నాడు నేడు ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు

### ఆరోగ్యశ్రీ అందుబాటులో లేకపోతే ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఉచిత వైద్యం

### ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 53 మంది లబ్ధిదారులకు రూ.19 లక్షల 90వేలు చెక్కులను అందచేసిన కె.కె.రాజు



సీతమ్మధార : అనారోగ్యం బారినపడి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 53 కుటుంబాలకు,విశాఖ ఉత్తర నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయ కర్త కె కె రాజు ముఖ్యమంత్రి సహాయనిధి ఇప్పించి ఆదుకున్నారు. సోమవారం విశాఖ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో 19లక్షల 90వేల రూపాయల చెక్కులను అందచేశారు..

ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసినప్పటినుండి బడుగు బలహీన వర్గాలు సంక్షేమమే లక్యంగా నిరంతరం పనిచేస్తున్నారని తెలియజేశారు.

ఈ రాష్ట్రంలో వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చి రాష్ట్రంలో ఏ పేదవాడు కూడా ఆర్థిక స్తోమత లేక వైద్యం చేయించుకోలేక మరణించకూడదు ఏ ఒక్క పేదవాడు నేను అనారోగ్యంతో ఉన్నాను నా ఆర్థిక స్తోమత బాగోలేక నేను మంచి వైద్యం చేయించుకోలేకపోయాను అనే భావన కలగకూడదు అనే ఉద్దేశంతో వై.యస్.జగన్మోహన్ రెడ్డి వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చారని తెలియజేశారు.



ఈ క్రమంలో రూ1000ఫీజు నుండి 10 లక్షల ఫీజు వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందే విధంగా మార్పులు చేయటం జరిగిందని వందలాది వ్యాధులు ఆరోగ్యశ్రీ ద్వారా వర్తింప జేసే విధంగా సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు..

మన రాష్ట్రంలో వీలుకాని కొన్ని రకాల వ్యాధులు పక్క రాష్ట్రంలో ఎక్కడైనా వైద్యం చేయించుకుంటే వాటికి కూడా అర్హతను బట్టి ఆరోగ్యశ్రీ ద్వారా అనుమతి ఇవ్వటం జరుగుతుందని అన్నారు.

ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని కొన్ని వ్యాధుల బారిన పడితే వాటికి కూడా అర్హత ను బట్టి ముఖ్యమంత్రి సహాయనిది నుండి ఆర్థిక సాయం అందించటం జరుగుతుందని అన్నారు.

నాడు-నేడు ద్వారా ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి అనే నినాదంతో ప్రభుత్వ హాస్పటల్స్ ను ప్రవేటు హాస్పిటల్స్ కి ధీటుగా అభివృద్ధి చేసి అన్ని సదుపాయాలు కల్పిస్తు ప్రతి పేదవాడు దైర్యంగా వెళ్ళి వైద్యం చేయుంచుకునే విదంగాచేస్తున్నారని అన్నారు. ఏ కారణంతోనైనా ఆరోగ్యశ్రీ వర్తించకపోతే ముఖ్యమంత్రి సహాయనిదినుండి వైద్యం చేయుంచుకోవడం కోసం అప్లికేషన్ పెట్టుకుంటే 12గంటలు లోపు ఎల్ఓసిలు ఇవ్వటం జరుగుతుందని అలాగే వైద్యం చేయించుకొని ఆరోగ్యశ్రీ వర్తించకపోతే రియంబర్స్ మెంట్ ద్వారా చెక్కులు ఇవ్వటం జరుగుతుందని అన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రియంబర్స్ మెంట్ ద్వారా విశాఖ ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి 53మందికి 20లక్షల రూపాయల చెక్కులు ఇవ్వటం జరిగిందని ఇప్పటి వరకు విశాఖ ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి ముఖ్యమంత్రి సహాయనిది నుండి రియంబర్స్ మెంట్ ద్వారా రూ35,60,000 ఎల్ఓసిలు ద్వారా కోటి 5లక్షలు ఇవ్వటం జరిగిందని రాష్ట్ర అభివృద్ధి కోసం నిజాయితీగా అహర్నిశలు కష్టపడుతున్న మన జగన్మోహన్ రెడ్డికి అండగా మీరు అందరూ నిలవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో...

మాజీ కార్పొరేటర్లు బానాల శ్రీను, జి.వి.రమణి,బులుసు జగదీష్,వార్డు అభ్యర్థులు సాడి పద్మారెడ్డి,సారిపిల్లి గోవింద్,ఆళ్ళ లీలావతి,కటుమూరి సతీష్, కంటిపాము కామేశ్వరి, వి.ప్రసాద్,రెయ్యి వెంకటరమణ,బర్కత్ అలీ,వార్డు అధ్యక్షులు షేఖ్ జుబేర్,పైడి రమణ,కె.పి.రత్నాకర్, సీనియర్ నాయకులు నీలి రవి,విశ్వనాధ రాజు, షేఖ్ బాబ్జి,బోగవల్లి గోవింద్,కొణతాల రేవతి రావు,ఆదిరెడ్డి అప్పారావు, గంగా మహేష్, నంబాల ఈశ్వరవు, వై.సింద్దార్ద,కోరిబిల్లి విజయ్,వసంతల అప్పారావు,కె.చిన్నా, బి.గోవింద్,రాఘవులు,పద్మ శేఖర్,గోపి,మీసాల అప్పారావు, సన్నీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# అందరూ మాస్క్‌లను ధరించేలా అవగాహన కల్పించాలి



విశాఖపట్నం : జిల్లా లో కోవిడ్ - 19 ను అరికట్టేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న కలెక్టర్ వి.వినయ్ చంద్ ను " కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ " తరపున ఛైర్మన్ కోనాడ సుదర్శన్, కార్యదర్శి జి. అర్. ప్రభు కిరణ్, స్టేట్ కో ఆర్డినేటర్ శ్రీమతి మారియా మరియు జిల్లా ప్రెసిడెంట్ శ్రీమతి హిల్డా మ్యాత్యు లు అభినందనలు తెలిపి, శాలువా తో సత్కరించారు.

కరోనా వ్యాప్తి నివారణకు అన్ని వ్యాపార సంస్థలు వినియోగదారులకు తప్పనిసరిగా శ్యానిటైజర్ ను అందుబాటులో ఉంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. అందరూ మాస్క్ లను ధరించేలా అవగాహన కల్పించాలని కోరారు.

# దామా సేవలు ప్రశంసనీయం



గాజువాక: నిత్యం ప్రజల మధ్యన ఉంటూ..ప్రజా సమస్యలపై స్పందిస్తూ సొంత నిధులతో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్న 86వ వార్డ్ వైకాపా అభ్యర్థి దామా సుబ్బారావు పై వార్డ్ ప్రజలు ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. సోమవారం సేవాకార్యక్రమంలో భాగంగా86వ వార్డులో కరోనా వైరస్ కట్టడి నేపాధ్యంలో స్వంత నిధులతో వార్డులో ప్రత్యేక వాహనం ద్వారా శానిటైజెషన్ పనులు నిర్వహించారు. అలాగే వర్షాకాలం కావడంతో స్మశానవాటికలో యద్ధేచ్ఛగా పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగిపోవడంతో స్థానిక ప్రజలు దామా దృష్టికి తీసుకురావడంతో స్మశానవాటిక పరిశుభ్రతకి అలాగే పిచ్చి మొక్కలను తొలగించడానికి జెసిబిని ఏర్పాటు చేసి, శుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దామా మాట్లాడుతూ వార్డ్ అభివృద్ధి కి నిత్యం ప్రజా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో 2020-21 అకాడమిక్ ఇయర్ కు సంబంధించి ప్రైమరీ స్కూళ్ల అకడమిక్ క్యాలెండర్ రెడీ

పెద్దాపురం : ఆంధ్రప్రదేశ్ లో 2020-21 అకాడమిక్ ఇయర్ కు సంబంధించి ప్రాథమిక పాఠశాలల అకడమిక్ క్యాలెండర్ ను సిద్ధం చేశారు విద్యాశాఖ అధికారులు. ఆ రాష్ట్ర సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా సెప్టెంబరు 5న పాఠశాలలు తెరుచుకోనున్నాయి.అందుక అనుగుణంగా ఈ క్యాలెండర్ రూపొందించారు. కరోనా పరిస్థితిని అంచనా వేసి మరో వారం, పది రోజుల్లో అకడమిక్ క్యాలెండర్‌ను పాఠశాల విద్యాశాఖ అధికారికంగా ప్రకటిస్తుంది.

సన్నాహక క్యాలెండర్ ప్రకారం %ా% వచ్చే నెల 5 నుంచి పాఠశాలలు పునఃప్రారంభిస్తారు. సెప్టెంబరులో 21 రోజులు, అక్టోబరులో 21 రోజులు, నవంబరులో 24 రోజులు, డిసెంబరులో 25/22 రోజులు, జనవరిలో 20/23 రోజులు, ఫిబ్రవరిలో 23 రోజులు, మార్చిలో 25 రోజులు, ఏప్రిల్‌లో 21 రోజులు పాఠశాలలు పనిచేయనున్నాయి. మొత్తంగా 2022-21లో 181 పనిదినాలు ఉంటాయి.

**పరీక్షల ప్రణాళిక:** నిర్మాణాత్మక మూల్యాంకనం-1 పరీక్షలు అక్టోబర్ లో, సంగ్రహణాత్మక మూల్యాంకనం-1 పరీక్షలు జనవరిలో, నిర్మాణాత్మక మూల్యాంకనం-2 పరీక్షలు మార్చిలో, సంగ్రహణాత్మక మూల్యాంకనం-2 పరీక్షలు ఏప్రిల్‌లో జరుగుతాయి.

**కాలనిర్ణయ పట్టిక:** 1 నుంచి 5 తరగతులకు మొదటి పీరియడ్ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. సాయంత్రం 4 గంటల వరకు మొత్తం 8 పీరియడ్‌లు ఉంటాయి. అయితే ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ క్లాస్-3, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ క్లాస్-4, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ క్లాస్-5లలో మూడేసి పాఠాలను తొలగించారు.

**సెలవుల ప్రణాళిక:** దసరా: 2.10.2020-26.10.2020; క్రిస్మస్: 24.12.2020-28.12.2020; సంక్రాంతి :12.01.2021- 17.01.2021; **వేసవి సెలవులు:** 24.04.2021-11.06.2021 వరకు ఉండనున్నాయి.

# వివేకానంద అనాథ వృద్ధాశ్రమంలో పలు సేవా కార్యక్రమాలు


### - ఘనంగా అన్నదానం - వివేకానంద సంస్థకు మిక్సీ వితరణ



విశాఖపట్నం : ప్రముఖ సంఘ సేవకులు, ప్రఖ్యాత పారిశ్రామిక వేత్త కంచర్ల రాంప్రసాద్ జన్మదినోత్సవం సందర్భంగా వివేకానంద అనాథ వృద్ధాశ్రమంలో.. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులతో.. పాటు నిరుపేదలకు కూడా అన్నదానం చేశారు. ప్రీతి మిక్సీని వితరణగా అందజేశారు. సంఘ సేవకులు రాంప్రసాద్ కు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు పుష్పగుచ్ఛం అందజేసి, జన్మ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. సూరాడ అప్పారావు మాట్లాడుతూ.. కంచర్ల కుటుంబ సభ్యులు మహా అన్నదాతలు అని కొనియాడారు. వివేకానంద సంస్థ చేపట్టిన..అనేక సేవా కార్యక్రమాలకు చేయూత అందించారని కృతజ్ఞతలు తెలిపారు. లాక్ డౌన్ సమయంలో వారు చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. వృద్ధులు, అనాథలు, నిరుపేద కుటుంబాల ఆకలి తీర్చడం కోసం.. బియ్యం బస్తాలు, కందిపప్పు బస్తాలు అందజేసిన గొప్ప అన్నదాతలు అని కొనియాడారు.. గర్భిణీలు, బాలింతలు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, రిక్షా కార్మికులు, ఆటో కార్మికులు, క్యాబ్ డ్రైవర్లు, పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకార మహిళలు, హమాలీలకు.. ప్రతీ రోజూ అల్పాహారాలు, భోజనాలు అందజేసిన సహృదయులు అని శ్లాఘించారు.

మినరల్ వాటర్ ప్లాంట్, వంటగది, సంస్థ అదనపు అంతస్థు నిర్మాణాలకు వారు అందించిన సాయం మరువలేమని వ్యాఖ్యానించారు.

# సిద్ధివినాయక మహోత్సవంలో పాల్గొన్న మణిభూషణ్



కొమ్మాది : నగరానికి చెందిన ప్రముఖ చిత్ర దర్శకుడు మణి భూషణ్, ఆయన సతీమణి నీరజ మధురవాడ ధర్మాన హైట్ స్ అపార్ట్మెంట్ ఆవరణలో సిద్ధివినాయక కమిటీ ఏర్పాటు చేసిన గణేష్ మండపమం లో జరిగిన సిద్ది వినాయక మహోత్సవం లో పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగ జరిగే ఈ వినాయక చవితి ఈ కరొన నేపద్యమ్ లో నిబందనలు పాటిస్తూ ఆ గణపతిని కొలవడం నిజంగా ఒక కొత్త గా ఉందని . రాబోయే రోజుల్లో కరొన విపత్తును ఆ గణేషుడి ఉక్కు పాదం తో కాలరాస్తడాని. ప్రజలందరికీ మంచి ఆరోగ్యం, సంపద, జీవనోపాధి కలిగేలా దీవించాలని మనసారా కోరుకున్నానని, వినాయక చవితి ఒక గెలుపుకు మార్గమని. మానవాళి యావత్తు పడుతున్న భాద కు పరిష్కారం ఆ సిద్ది వినాయకుడు ఈ చవితి వ్రతం తో లబిస్తుందని ఆశభావం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా హీరో మరియు నిర్మాత ఆదిత్య భూషణ్ మాట్లాడుతూ సిద్ది వినాయక పూజ లో పాల్గొనడం ఆనందంగా ఉందని రాబోయే రోజుల్లో ప్రజల కష్టాలు తీరి అంధరు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నని తెలిపారు. కమిటీ సభ్యులు ప్రసాద్, దుర్గరావ్, శ్రీనివాసరావ్, లక్ష్మీధర్, రజనీ, సన్యాసిరావ్, సత్యనారాయణ ఇతరులు హాజరయ్యారు. అపార్ట్మెంట్ వాసులు అందరూ ఆనందంగా ఈ కార్యక్రమం లో చిన్న, పెద్ద పాల్గొని ఆ సిద్ధి వినాయకుడ్ని వేడుకున్నారు.

# పేద పిల్లలకు ఇమ్మానుయేల్ ఛారిటబుల్ సొసైటీ నిత్యావసర సరుకులు పంపిణీ




భీమునిపట్నం : స్థానిక చిన్న బజార్ లో ఉన్న ఇమ్మానుఎల్ చారిటబుల్ సొసైటి యాజమాన్యం వారు తోటవీది, మేదరవీది, అప్పికొండవీది, కుమ్మరిపాలెం, లో గల పేద పిల్లలకు సోమవారం జరిగిన కార్యక్రమంలో బియ్యం, నూనె,కూరగాయలు, బ్రేడ్, పాలు, హార్లిక్స్, గుడ్లు పంపిణీ చేశారు.

భీమిలి లో గల సొసైటి ఇక్కడ ఉన్న 150 మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను 20 సంవత్స రాలుగా అందిస్తున్నారు. సొసైటి అధ్యక్షుడు పి. జార్జ్ సూర్య కుమార్ మాట్లాడుతూ తమ సొసైటి పేద పిల్లలకు చక్కటి విద్యను అందించ డంతోపాటు వారిని అన్నింటా ప్రోత్సహిస్తుందని తెలిపారు.

# కరోనా మందులు పంపిణీ



కాకినాడ రూరల్ : రెడ్డి అప్పలరాజు ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో పితాని రాము సమకూర్చిన కరోనా నివారణా మందులు పంపిణీ కార్యక్రమం కాకినాడ రూరల్ మండలం బర్మా కోలనీ బాలగణపతి ఆలయం వద్ద కాకినాడ రూరల్ ఇంచార్జ్, సర్పవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్.గోవింద రాజులు చేతుల మీదుగా మందులు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా సిఐ గోవిందరాజులు మాట్లాడుతూ రెడ్డి అప్పల రాజు భౌతికంగా దూరం అయినా వారి పేరున సేవా కార్యక్రమాలు అందించడం అభినంద నీయమన్నారు. కరోనా లాక్ డౌన్ ప్రారంభం నుండి జిల్లా వ్యాప్తంగా మాస్కులు, శానిటైజర్లు, మందులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎర్రబాట దినపత్రిక సంపాదకులు పితాని వెంకట రామును అభినందించారు.ఈ కార్యక్రమంలో సుమారు 300ల కుటుంబాలకు కరోనా నివారణ మందులు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో రెడ్డి అప్పలరాజు కుటుంబ సభ్యులు రెడ్డి అప్పారావు, రెడ్డి లక్ష్మి,రెడ్డి నాయుడు బాబు, మిత్రులు వాసంసెట్టి పద్మనాభం, సవిలే సురేష్, ఇంధన పురుషోత్తం, అరవ శంకర్,అరవ ప్రసాద్, కండిపిల్లి అప్పల రాజు, కండిపిల్లి జగన్, రాజపూడి కృష్ణ, పేంకే రాజు, గన్ని రాజు, కొప్పిసెట్టి శ్రీను, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలు పునఃప్రారంభం పై అలీవర్ రాయ్ స్పందన



భీమునిపట్నం: ఎపి ప్రభుత్వం విడుదల చేసిన 2020-2021 విద్యా సంవత్సర ప్రణాళికపై ప్రముఖ సామాజికవేత్త మరియు కేథరిన్ విద్యాసంస్థల అధినేత అలీవర్ రాయి స్పందించారు. విదేశాలలో ఇప్పటికే పాఠశాలల పునః ప్రారంభం వలన ఎదురుకుంటున్న విపరీత పరిణామాలు, తీవ్ర పరిస్థితులను అధ్యయనం చెయ్యకుండా రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు ప్రదర్శిస్తుందని అన్నారు. కనీసం దేశంలో ఎక్కడ కూడా ప్రతిపాదించని ఈ విషయంలో మన రాష్ట్రంలోనే ఈ కంగారెందుకని ప్రశ్నించారు.

విదేశాలలో పాఠశాలలు పునః ప్రారంభించాక రెండు వారాలు కూడా కాకుండ పాఠశాలల్లో ఒక్కసారిగా కరోనా విజృంభించి వందల సంఖ్యలో విద్యార్థులు, టీచర్లు క్వారంటైన్ వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. రోజు 7 గంటల బోధన సమయం అంతసేపు పిల్లలు మాస్కులు ధరించి ఉండాలంటే కష్టం, ధరించకపోతే వైరస్ వ్యాప్తి ప్రబలుతోందనీ తెలిపారు. ప్రభుత్వం ఒక స్పష్టమైన నిర్దిష్ట సమతుల్యత కలిగిన ప్రణాళిక అవసరమనీ ఆ తర్వాత పాఠశాలలు తెరవాలని అలీవర్ రాయి కోరారు.

## శివుడు విగ్రహము వెనుక గల
# ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం



పరవాడ : పరవాడ మండలము ముత్యాలమ్మ పాలెం గ్రామంలో బీచ్ సమీపంలో గలశివుని విగ్రహము వెనుకగల ప్రభుత్వ భూమి కొంత మంది అక్రమదారులు కన్నుపడింది. ఈస్థలం సమీపంలో మాఘపౌర్ణమి సమయంలో సంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటుచేసే వారిమని స్థానిక ప్రజలు అంటున్నారు. కాని ఇప్పుడు ఈ స్థలాన్ని కొంతమంది అక్రమించికోని షెడ్లును నిర్మిస్తున్నారని స్థానిక ప్రజలు అంటు న్నారు.

ఇక్కడ ఇంత తతంగము జరుగుతున్న రెవిన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారు అనీ పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంభందిత అదికారులు స్పందించి అన్యాక్రాంతమైన భూములును కాపాడాలనీ స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం పై స్థానిక వీఆర్వోనీ చరవాణిలో వివరణ కోరగా అక్రమణకు గురైన విషయం విధితమే అని, కాని అక్రమణను తొలిగించామని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

# భూముల కోసమే తెలుగుదేశంపార్టీ ఆరాటం

**వైసీపీ పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు**



అనకాపల్లి : అమరావతిలో ఉన్న 33 వేల ఎకరాల భూము లలో 80 శాతం భూములు తెలుగుదేశం నాయకులవే అన్న సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలిసినా మీకు తెలియకపోవడం చాలా విడ్డూరంగా ఉందని వైసీపీ పట్టణ అదికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు అన్నారు. అమరావతి ముసుగులో రియలెస్టేట్ చేసుకోవచ్చన్న మీ ఆలోచనలు కుదరకపోయే సరికి రైతలు పేర్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖలో మీ నాయకుడు యొక్క బందువులు భములు ఏమైపోతాయో అన్న ఆందోళనలో కార్య నిర్వాహణ రాజధానికి అడ్డుపడుతూ ప్రజలు పేరు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అమర నిరాహారదీక్ష అంటే మద్యాహ్నం కూర్చోని ఇంటికి వెళ్లిపోవడం కాదని విశాఖ రైల్వే జోన్ కోసం ప్రాణాలను కూడా లెక్క చేయకుండా అస్వస్థతకు గురై హాస్పటల్ పాలైన గుడివాడ అమర్నాథ్ దీక్షను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడు అమర్నాధ్ అని కొనియాడారు. అధికారంలో ఉన్నప్పుడు అఖిలపక్షాలు దీక్షలు చేస్తుంటే అప్పటి టీడీపీ ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్లు వ్యహిరించిందని చెప్పారు. ప్రకృతి విపత్తులను ఎదుర్కుంటూ ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల గుండెల్లో ముద్ర వేసుకున్న నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డిని ప్రజలు ఎప్పుడో గుర్తించారని నాగేశ్వరరావు అన్నారు.

# టైలర్స్ ను ఆదుకోవాలి



భీమునిపట్నం : జివియమ్సి భీమిలి డివిజన్ లో టైలర్స్ లకు ప్రభుత్వం ప్రకటించిన పదివేల రూపాయలు జగనన్న చేయూత పథకం కింద భీమిలి లో ముప్పయి ఎనిమిది మంది టైలర్స్ వున్నారు, వారిలో ఏడుగురికి మాత్రమే వచ్చాయని మిగత వాల్లకు రాలేదని ఆవేదన చెందుతున్నారు, కరోనా కాలంలో టైలర్స్ కు పనులు లేక ఆర్థిక గా ఇబ్బందులు పడుతున్న సమయంలో జగనన్న చేయూత పథకం టైలర్ కు సహయంగా అవుతున్నదని అనుకున్న సమయంలో కొందరికి వచ్చి కొందరికి రాలేదని ఆవేదన చెందుతున్నారు, త్వరగా వచ్చేలా చూడాలని భీమిలి జి వి యమ్ సి కమిషనర్ ఆఫీసు సిఓ శ్రీనివాసరావు ను భీమిలి టైలర్స్ కలిసి మాట్లాడారు ఇందులో జిల్లా టైలర్స్ ఉపాధ్యక్షుడు గిడుతూరి శ్రీను, జల్లా కార్యదర్శి యమ్ హరి, భీమిలి టైలర్స్ అధ్యక్షుడు యమ్ శ్రీను, తదితరులు ఉన్నారు.



**స్థానిక 29వవార్డ్ లో సోమవారం జగనన్న ఇచ్చిన మాట మేరకు వార్డులో కార్పొరేటర్ అభ్యర్థి ఉరికిటి నారాయణరావు ఆధ్వర్యంలో సుమారు 40 పైన డ్వాక్రా పొదుపు సంఘాలకు రుణమాఫీ చేయడం జరిగింది .అర్హులైన సంఘాలను పిలిచి వాళ్ళ వేలిముద్రలు ద్వారా వారి వారి అకౌంట్లో రుణమాఫీ నగదు వేయడం జరిగింది. డ్వాక్రా మహిళలు సీఎం జగన్ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.**

# శ్రమదానంతో రోడ్డుకు మరమ్మత్తులు



కొయ్యూరు : కొయ్యూరు మండలం సోలాబు గ్రామస్థులు రోడ్డుకు శ్రమదానం చేసుకొని రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టారు. ఇక్కడ కొత్తగా వేసిన రోడ్డు, కల్వర్టు వద్ద మట్టి కప్పకుండా ఉంచేశారు. దీంతో గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అధికారులకు తెలియజేసినా స్పందించకపోవడంతో గ్రామస్థులే స్వయంగా శ్రమదానం చేసి మట్టి కప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు లోత రమణ, శ్రీను, కొండబాబు, పాట్టిక శ్రీను, రాజేష్, వెలుసురి వెంకటేశ్వర్లు, సోమరాజు, మిగతా గ్రామస్థులు పాల్గొన్నారు.

# బయటపడ్డ వెయ్యేళ్ల కిందటి బంగారు నాణెలు



జెరూసలేం : ఇజ్రాయిల్ యావ్నే సమీపంలో ఇటీవల సాల్వేజ్ తవ్వకాల్లో బంగారు నాణేలు కనుగొన్నట్లు ఇజ్రాయిల్ పురావస్తు శాస్త్రవేత్తలు సోమవారం ప్రకటించారు. సుమారు 1,100 సంవత్సరాల కిందట ఉన్న అబ్బాసిద్ కాలానికి చెందిన 425 బంగారు నాణేలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇవి తొలి ఇస్లామిక్ నాణేలని ఇజ్రాయిల్ ఆంటిక్విటీస్ అథారిటీస్ పురావస్తు శాస్త్రవేత్తలు లియాత్ నడావ్-జివ్, ఎలీ హడ్డాడ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. యువ వలంటీర్ల తవ్వకాల్లో వందల కొద్దీ నాణేలు వెలుగు చూశాయి. ఈ సందర్భంగా నిపుణుడు రాబర్ట్ కూల్ మాట్లాడుతూ ఓ ప్రాథమిక విశ్లేషణ ప్రకారం 9వ శతాబ్దం చివరి కాలం నాటి నాణేలని తెలిపారు. ఇంత మొత్తంలో అత్యంత పురాతన నాణేలు దొరడం ఇజ్రాయిల్లో ఇదే మొదటిసారి. 2015లో ఔత్సాహిక డైవర్స్ 10, 11వ శాతాబ్దంలోని ఫాతిమిడ్ కాలానికి చెందిన పురాతన నగరమైన కైసర్ తీరంలో సుమారు 2వేల నాణేలను కనుగొన్నారు. 'ఈ అధ్యయనం గత కాలం గురించి మాకు మరింత సమాచారం తెలియజేస్తుందని ఆశిస్తున్నాను' అని రాబర్ట్ పేర్కొన్నారు.

# కిమ్ నుంచి కిమ్కు ఉత్తర కొరియా పగ్గాలు?



సియోల్: ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ అపస్మారక స్థితిలో ఉండటంతో.. ఆయన సోదరి కిమ్ యో జోంగ్ వాస్తవ పాలకురాలిగా పగ్గాలు చేపట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత నేత కిమ్ ఆరోగ్యం నానాటికీ దిగజారుతుండడంతో.. జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాల్లో నిర్ణయాధికారం ఆయన సోదరి చేతికొచ్చినట్లు సమాచారం. దక్షిణ కొరియా రాజకీయ వ్యవహారాల శాఖలో గతంలో ఉన్నతాధికారిగా వ్యవహరించిన చాంగ్ సాంగ్ మిన్ సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. "కుట్ర జరగటం, తీవ్ర అనారోగ్య పాలవటం వంటి సందర్భాల్లో తప్ప.. సాధారణ పరిస్థితుల్లో ఏ ఉత్తరకొరియా అధినేత తన అధికారాన్ని మరో వ్యక్తికి అప్పగించటం జరగదు. ప్రస్తుతం కిమ్ కోమాలో ఉన్నందు వల్లే అధికారం అతని సోదరి కిమ్ యో జోంగ్కు అప్పగించారు" అని తాజా వ్యవహారాలను పరిశీలిస్తున్న ఆయన వివరించారు. కిమ్ ప్రస్తుతం కోమాలో ఉన్నారని... మరణించలేదని తనకు స్పష్టమైన సమాచారం ఉన్నట్టు ప్రకటించారు. అయితే, దేశాధినేత పదవి దీర్ఘకాలం ఖాళీగా ఉండటం అభిలషణీయం కాకపోవటంతో కిమ్ యో జోంగ్ తెరపైకి వచ్చారని ఆయన వివరించారు. అమెరికా, దక్షిణ కొరియాలతో దౌత్యసంబంధ వ్యవహారాలను చక్కబెట్టేందుకు అమెకు అధికారాన్ని కట్టబెట్టినట్టు తెలిపారు. కాగా, పూర్తి అధికార బదలాయింపుకు ఇంకా రంగం సిద్ధం కావాల్సిఉందన్నారు.

# నిరూపిస్తే రాజీనామా చేస్తా : గులాం నబి ఆజాద్



హైదరాబాద్ : కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ వర్చువల్ సమావేశం ఇవాళ వాడివేడిగా జరిగింది. దాదాపు 23 మంది సీనియర్ నేతలు రాసిన లేఖ ఆ పార్టీలో పెనుదుమారం లేపింది. నాయకత్వ మార్పు జరగాలంటూ సీనియర్ల తమ ధిక్కార స్వరాన్ని వినిపించిన తీరు పట్ల సీడబ్ల్యూసీ సమావేశంలో వాగ్వాదాలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి లీడర్ కోసం ఎన్నికలు నిర్వహించాలంటూ కాంగ్రెస అధ్యక్షురాలు సోనియా గాంధీ తన సందేశం వినిపించారు. అయితే సీనియర్లు లేఖ రాసిన తీరుపై ఆ పార్టీలో ముసలం మొదలైంది. బీజేపీకి సహకరిస్తున్న సీనియర్లు.. అనుచిత సమయంలో లేఖ రాసినట్లు రాహుల్ గాంధీ ఆరోపించారు. దీంతో లేఖపై సంతకం చేసిన సీనియర్లు రాహుల్ వ్యాఖ్యలను తప్పుపట్టారు. బీజేపీతో లింకు పెట్టుకున్నట్లు రాహుల్ గాంధీ నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానంటూ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ సవాల్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలను సీనియర్ నేత కపిల్ సిబల్ తప్పుపట్టారు. తానెన్నడూ బీజేపీకి అనుకూలంగా మాట్లాడలేదని తన ట్విట్టర్లో తెలిపారు. గత 30 ఏళ్లలో తాను ఎప్పుడూ బీజేపీకి అనుకూలంగా కామెంట్ చేయలేదన్నారు. బీజేపీతో జతకట్టినట్లు అన్యాయంగా ఆరోపిస్తున్నారని కపిల్ సిబల్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరపున రాజస్థాన్ హైకోర్టులో పోరాడటం బీజేపీతో జతకట్టినట్లేనా అని సిబల్ ప్రశ్నించారు. బీజేపీని కూల్చేందుకు మణిపూర్లో కాంగ్రెస్ పార్టీ డిఫెండ్ చేయడం తప్పా అని అన్నారు.

# ఆర్జీవీకి నల్గొండ కోర్టు షాక్

నల్గొండ : ప్రముఖ దర్శకుడు రాంగోపాల్వర్మ(ఆర్జీవీ)కు నల్గొండ న్యాయస్థానం షాక్ ఇచ్చింది. మిర్యాలగూడలో హత్యకు గురైన ప్రణయ్ ప్రేమ వ్యవహారం ఆధారంగా రాంగోపాల్వర్మ 'మర్డర్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ క్రమంలో తమపై చిత్రీకరిస్తున్న సినిమాను నిలిపివేయాలంటూ ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి గత నెలలో కోర్టులో సివిల్ దావా వేశారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు.. ప్రణయ్ హత్య కేసు విచారణ పూర్తయ్యే వరకు 'మర్డర్' సినిమా చిత్రీకరణ నిలిపివేయాలంటూ నిర్మాతలు రాంగోపాల్వర్మ, నట్టి కిరణ్లకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వారికి ఉత్తర్వులను వెంటనే అందజేయాలని కోర్టు ఇన్ఛార్జి న్యాయమూర్తి నాగరాజు ఆదేశించారు. ఈ సినిమా విషయమై గతంలోనే ఆర్జీవీ స్పందించారు. 'మర్డర్' సినిమాతో ఇతరుల్ని చెడుగా చూపించడం తన ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. "ఈ కేసు కవర్ చేసిన ఓ పాత్రికేయుడి కోణంలో ఈ సినిమా ఉండొచ్చు! విచారణ చేసిన పోలీసు అధికారి ఆలోచనలకు సంబంధించింది కావొచ్చు.. వివిధ మాధ్యమాల ద్వారా దీని గురించి తెలుసుకున్న వ్యక్తి ఉద్దేశం అయినా కావొచ్చు. ఓ దర్శక, నిర్మాతగా నా ఆలోచనల ప్రకారం మర్డర్ను తెరకెక్కించే హక్కు నాకుంది. కొందరిని చెడుగా చూపించడానికి నేను ఈ సినిమాను తీస్తున్నాను అనుకోవడం సరికాదు. ఎందుకంటే.. ఏ వ్యక్తి చెడు కాదని నేను గట్టిగా నమ్ముతా. కేవలం ప్రతికూల పరిస్థితులు వ్యక్తిని చెడ్డవాడిని చేస్తాయి.

అలా ప్రవర్తించేందుకు కారణమౌతాయి. దీన్నే నేను 'మర్డర్'లో చూపించాలి అనుకుంటున్నా. ఆ ప్రకటన రాసిన వారికి నేను చివరిగా ఒకటి చెబుతున్నా.. మనుషులపై, వారి ఫీలింగ్స్పై నాకు గౌరవం ఉంది. వారు పడ్డ బాధను, నేర్చుకున్న పాఠాన్ని గౌరవిస్తూ మర్డర్ తీయబోతున్నా" అని వర్మ పేర్కొన్నారు.

# రూమర్స్ని ఖండించిన బాలు తనయుడు



ప్రముఖ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంకు తాజాగా నిర్వహించిన పరీక్షల్లో కరోనా నెగెటివ్ వచ్చిందని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందంటూ పలు వార్తలు పుట్టుకొచ్చాయి. దీనిపై స్పందించిన చరణ్ అవన్నీ అవాస్తవం అని అన్నారు. నాన్న ప్రస్తుతం వెంటిలేటర్పైనే ఉన్నారు. ఆరోగ్యం కొంత నిలకడగానే ఉంది. నాన్న ఆరోగ్యం గురించి నేనే ఎప్పటికప్పుడు అప్డేట్స్ ఇస్తాను పుకార్లు నమ్మొద్దంటూ చరణ్ కోరారు.

బాలుకు ప్రస్తుతం ఎంజీఎం వైద్యుల పర్యవేక్షణలో ఎక్మో సపోర్ట్తో చికిత్స జరుగుతుంది కాగా, ఈ నెల 5న ఎస్పీ బాలు ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. 14 వ తేదీ వరకు బాగానే బాలుకి ఆ తర్వాత ఆరోగ్యం క్షీణించడంతో 19 నుండి ఎక్మో చికిత్స మొదలు పెట్టారు. త్వరగా కోలకుకోవాలని అశేష సినీలోకం ప్రార్థిస్తుంది.

# సాలూరు గిరిజనులకు సోనూసూద్ అభినందన

విజయనగరం : ఆంధ్రప్రదేశ్లోని విజయనగరం జిల్లా సాలూరు మండలం మారుమూల ప్రాంతమైన కొదమ గ్రామ గిరిజనులు స్వచ్ఛందంగా చేపట్టిన రహదారి నిర్మాణంపై బాలీవుడ్ నటుడు సోనూ సూద్ ట్విటర్ ద్వారా స్పందించారు. కొదమ పంచాయితీలో 150 కుటుంబాలు ఉన్నాయి. అయితే, ఆ కుటుంబాలు నిత్యావసర వస్తువులు తీసుకెళ్లేందుకు, రోగులను ఆసుపత్రికి తరలించేందుకు సరైన రోడ్డు, రవాణా సౌకర్యం లేదు. ఏ చిన్న అవసరం వచ్చినా కొండలు, గుట్టల్లో కాలి నడకన వెళ్లాల్సిందే. నిత్యావసరాల కోసం ఒడిశా సరిహద్దులో 4కి.మీ దూరాన ఉన్న బారి గ్రామంలోని సంతకు కాలినడకనే వెళ్తుంటారు. ఇక గర్భిణికి పురిటి నొప్పులు వస్తే అంతే సంగతులు. అలాంటి సందర్భాల్లో గ్రామస్థులు డోలీ కట్టి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వారిని సమీప ఆసుపత్రికి తీసుకెళ్తుంటారు.

ఈ నేపథ్యంలో గ్రామస్థులంతా కలిసి సంతకు వెళ్లే బారి గ్రామం వరకైనా రహదారిని నిర్మించుకోవాలని సంకల్పించారు. ఈ క్రమంలో ఒక్కో ఇంటికి రూ.రెండు వేలు చొప్పున చందాలు సేకరించి రెండు జేసీబీలను అద్దెకు తీసుకుని రెండు వారాలపాటు శ్రమించి కొండను తొలిచారు.

మరో వారం రోజుల పాటు మట్టివేసి నాలుగు కిలోమీటర్ల మేర రహదారిని ఏర్పరుచుకున్నారు.

# ఏయూలో బీటెక్ హానర్స్ కోర్సుకు శ్రీకారం

- అంతర్జాతీయ బిబిఏ-ఎంబిఏ నిర్వహణకు సెనేట్ అనుమతి
- టెక్స్టైల్ డిజైనింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో వొకేషనల్ కోర్సు
- విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యను అందించే దిశగా సిలబస్‌లో మార్పులు

## వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యను అందించే దిశగా సిలబస్ రూపకల్పన చేయడం జరుగుతోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ అకడమిక్ సెనేట్ సమావేశం జరిగింది. సెనేట్ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్కర పరిస్థితులను అధిగమిస్తూ ముందకు సాగడం జరుగుతోందన్నారు. అన్‌లైన్ బోధన విధానాన్ని అవలంబించామన్నారు. వర్సిటీలోని పలు విభాగాలు వెబినార్‌లను సమర్ధవంతంగా నిర్వహించాయన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో సైతం తమ విశ్వవిద్యాలయం ఆచార్యులు సమర్ధవంతంగా పరిశోధన ప్రాజెక్టలను సాధించడం శుభపరిణామమన్నారు. త్వరలో విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో సేవలు అందించే దిశగా, విద్యార్థులకు తరగతులు, పరీక్షల నిర్వహణకు విభిన్న వ్యూహాలను అవలంభించడం జరుగుతోందని వివరించారు.

ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్‌తో ఎంఓయూ, అవంతీ ఫౌండేషన్ సహకారంతో ఎంఎల్‌ఆర్ విభాగంలో పరిశోధన కేంద్రం నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. జాతీయ స్థాయిలో ఎన్ఐఆర్ఎఫ్‌లో 19వ స్థానం, నేచర్ ఇండెక్స్‌లో 4వ స్థానం, ఇండియా టుడేలో 12వ స్థానాన్ని ఏయూ సాధించిందన్నారు. విశ్వవిద్యాలయం 93వ వార్షిక నివేదికను రెక్టార్ ఆచార్య కె.సమత ప్రతిపాదించారు. వర్సిటీ వార్షిక బడ్జెట్‌ను సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావులు సెనేట్ ముందుంచారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి టెక్స్టైల్ డిజైనింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో బ్యాచిలర్ వొకేషనల్ కోర్సును, ప్రొడక్ట్ డిజైనింగ్‌లో వొకేషనల్ డిప్లమో కోర్సును 2021 నుంచి ప్రారంభించడానికి సెనేట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుత తరుణంలో ఇటువంటి కోర్సులకు మంచి ఆదరణ ఉంటుందని సెనేట్ సభ్యులు అభినందించారు. రూసా పథకంలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో బిబిఏ-ఎంబిఏ కోర్సును 2020-21 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు.

ఇంజనీరింగ్ విద్యార్థులను నైపుణ్యాలను అందించే చర్యల్లో భాగంగా బిఎస్ఎన్ఎల్‌తో ఎంఓయూ చేసుకుని విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ప్రాజక్ట్ వర్క్, సర్టిఫికేట్ కోర్సును అందించే దిశగా, ఎంబిఏ(మార్కెటింగ్, హెచ్ఆర్, ఫైనాన్స్) విద్యార్థులకు ఉపయుక్తంగా దీనిని తీర్చిదిద్దాలని నిర్ణయం తీసుకున్నారు. ఏయూ సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ నుంచి కొత్తగా 10 కోర్సులను నిర్వహించడానికి సెనేట్ ఆమోదం తెలిపింది.

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి సూచించిన విధంగా ప్రతీ విద్యార్థికి ఉపాదిని అందించే దిశగా ఇంజనీరింగ్ సిలబస్‌లో మార్పులు చేసారు. బిటెక్ హాజన్స్, బిటెక్ మైనర్ కోర్సులను ప్రారంభించడానికి సెనేట్ ఆమోదం తెలియజేసింది.

ప్రతీ విద్యార్థికి పూర్తిస్థాయిలో నైపుణ్యాలు, అదనపు సామర్థ్యాలు కల్పించే దిశగా ఈ 10 నెలలు ఇంటర్న్‌షిప్,5 స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను దీనిలో అందించనున్నారు.

ఎంఆర్ సంస్కృత కళాశాల నుంచి ఐదేళ్ల బిఏ ఓరియంటల్ లాంగ్వేజ్ కోర్సును ప్రారంభించడానికి సెనేట్ అనుమతి ఇచ్చింది.

సమావేశంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, మాజీ వీసీ ఆచార్య కె.వి రమణలు ప్రత్యక్షంగా పాల్గొనగా మాజీ వీసీలు ఆచార్య జి.ఎస్.ఎన్ రాజు, ఆచార్య బీల సత్యనారాయణలు పరోక్షంగా పాల్గొన్నారు.

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి ఆన్‌లైన్‌లో సదస్సులో పాల్గొన్నారు. ఏయూ సాధిస్తున్న ప్రగతి రాష్ట్రంలో ఇతర విశ్వవిద్యాలయాలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఏయూ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కరోనా విపత్తు సమయంలో సైతం ఆచార్యులు పరిశోధన ప్రాజెక్టులు సాధించడం స్ఫూర్తిని నింపుతోందన్నారు.

# డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించిన జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన




విశాఖపట్నం : జి.వి.ఎం.సి. ప్రధాన కార్యాలయం సమావేశపు మందిరం నుండి డయల్ యువర్ కమిషనర్ ప్రోగ్రామును కమిషనర్ డా. జి. సృజన, టోల్ ఫ్రీ నం. 1800-4250- 0009 ద్వారా ఉదయం 10.00 గం. నుండి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా ప్రజలనుండి విజ్ఞప్తులు స్వీకరించారు. స్వీకరించిన విజ్ఞప్తులను స్వయంగా పరిష్కరించి తగు నివేదిక వెంటనే సమర్పించు నిమిత్తం ఆయా విభాగాల అధికారులను/జోనల్ కమిషనర్లకు పంపించారు. ఇందులో 1వ జోనుకు సంబందించి 04, 2వ జోనుకు సంబందించి 04, 3వ జోనుకు సంబందించి 03, 4వ జోనుకు సంబందించి 04, 5వ జోనుకు సంబందించి 02, 6వ జోనుకు సంబందించి 02, మొత్తము 19 ఫిర్యాదులు ఫోను ద్వారా స్వీకరించారు మరియు ప్రధాన కార్యాలయ విభాగపు ఉన్నతాధికారులతోను, జోనల్ కమిషనర్లతోను మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యా దులు, 03 రోజులలో పరిష్కరించేందుకుగాను తగు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ డా. జి. సృజన సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎ. వి. రమణి, ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ మంగపతి రావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యు.సి.డి.) వై. శ్రీనివాసరావు, సి.సి.పి. విద్యుల్లత, సి.ఎం.ఓ.హెచ్. డా. కె.ఎల్.ఎస్.జి. శాస్త్రి తదితర అధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 3 న ఏపీ కేబినెట్ భేటీ

తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలి మరోసారి భేటీ కానుంది. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించి మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోనుంది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన వెలగపూడిలోని సచివాలయంలో సెప్టెంబర్ 3, ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ఉండనుంది. కాగా, ఆగస్టు 19 న జరిగిన సమావేశంలో 'వైఎస్సార్ ఆసరా', 'జగనన్న విద్యా కానుక', 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ,' వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్' పథకాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# ప్రణబ్ ఆరోగ్యంలో ఎలాంటి మార్పులేదు..!



దిల్లీ: భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. ప్రస్తుతం ఆయన కోమాలో ఉన్నారని దిల్లీ కంటోన్మెంట్‌లోని సైనిక ఆసుపత్రి వెల్లడించింది. వెంటిలేటర్ సహాయంతోనే చికిత్స అందిస్తున్నామని తెలిపింది. అయితే.. ఆయన ఆరోగ్య సూచీలు మాత్రం నిలకడగానే ఉన్నాయని తాజా హెల్త్ బులెటిన్‌లో పేర్కొంది. మెదడులో రక్తం గడ్డకట్టడంతో ఆగస్టు 10న ప్రణబ్ ముఖర్జీ దిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో నిర్వహించిన కొవిడ్ పరీక్షల్లో ఆయనకు కరోనా వైరస్ సోకినట్లు తేలింది. అనంతరం ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం ప్రత్యేక వైద్యబృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది.

# రమేష్‌ను చంద్రబాబు ఎందుకు వెనకేసుకొస్తున్నారు?



తాడేపల్లి: అమరావతిలో ప్రజా ఉద్యమమే లేదు. అక్కడ జరిగేది భూస్వామ్య, పెట్టుబడిదారి, ధనవంతుల ఉద్యమం అన్నారు వైస్సార్సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. 'చంద్రబాబు రాజధాని కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నట్టు భ్రమ కల్పిస్తున్నారు. అమరావతి అనేది పెద్ద స్కాం. చంద్రబాబు తన తాబేదార్లు కోసం పెట్టిందే అమరావతి. రాజధాని కోసం 85 మంది చనిపోయిన దాఖలాలు లేవు. అదంతా ఓ కట్టుకథ. రాజధాని కోసం త్యాగాలు లేవు. సాధారణంగా చనిపోయిన వారిని అమరావతి కోసం చనిపోయారని ప్రచారం చేస్తున్నారు. 85 మంది అమరావతి కోసం చనిపోతే ఉద్యమమం ఇలా ఉంటుందా. దళితులకు ఇచ్చిన భూములను టీడీపీ నేతలు బలవంతంగా లాక్కున్నారు. అమరావతిలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతుంది. ఇప్పటికే కొంతమందిని అరెస్ట్ చేశారు. త్వరలో మరికొంత మందిని అరెస్ట్ చేస్తారు. అభివృద్ధి అంతా హైదరాబాద్‌లో కేంద్రీకృతం కావడం వలన మనం నష్ట పోయాం. ఏ ప్రాంతానికి అన్యాయం జరగకూడదనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వికేంద్రీకరణ చేశారు' అని స్పష్టం చేశారు అంబటి. అంతేకాక 'జూమ్‌లో చంద్రబాబు ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఎవరిని సంప్రదించకుండా మూడు రాజధానులపై నిర్ణయం తీసుకున్నారని మాట్లాడటానికి చంద్రబాబుకు సిగ్గుండాలి. పరిపాలన వికేంద్రీకరణపై శాసనసభలో చర్చ జరిగింది. ఆ రోజు చంద్రబాబు అసెంబ్లీ నుంచి పారిపోయారు. పీడిత ప్రజలకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుకున్న చంద్రబాబుకు సీపీఐ రామకృష్ణ మద్దతు తెలుపుతున్నారు. తమది కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియానా.. లేక క్యాప్టలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియానా అనే దానికి రామకృష్ణ సమాధానం చెప్పాలి.

నేరం జరిగినప్పుడు దర్యాప్తు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. రమేష్ హాస్పిటల్స్ నిర్లక్ష్యం కారణంగా పది మంది చనిపోయారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదా. అప్పుడు నిమ్మగడ్డ రమేష్, ఇప్పుడు డాక్టర్ రమేష్‌ను చంద్రబాబు ఎందుకు వెనకేసుకొస్తున్నారు. ఎందుకు దాస్తున్నారు.. తనని పోలీసులకు అప్పగించాలి. విచారణకు రమేష్ సహకరించాలి. తనని ఎక్కడ దాచారో చంద్రబాబు సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు అంబటి.

# తెలుగురాష్ట్రాల మధ్య బస్సు సర్వీసులు!

### చర్చలు జరుపుతున్న అధికారులు

హైదరాబాద్: తెలంగాణ -ఆంధ్రప్రదేశ్ మధ్య ఆర్టీసీ బస్సుల పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపట్టారు. బస్సులు నడపడంపై ఇరు రాష్ట్రాల ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో చర్చలు జరుపుతున్నారు. విజయవాడ నుంచి ఏపీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు బస్‌భవన్‌కు చేరుకుని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఎండీ సహా ఉన్నతాధికారులతో చర్చలు జరపుతున్నారు. అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు నడిపేందుకు పరస్పరం ఒప్పందం చేసుకునేందుకు ఇప్పటికే ఇరు రాష్ట్రాల ఆర్టీసీ అధికారులు అంగీకరించారు. అంతర్రాష్ట్ర ఒప్పందం రూపకల్పన, అమలు చేయాల్సిన విధానంపై సమగ్రంగా చర్చిస్తున్నారు. అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు ఏ ప్రాంతాలకు ఎన్ని నడపాలి, పాటించాల్సిన విధి విధానాలు తదితర అంశాలపై అధికారులు సుదీర్ఘంగా చర్చిస్తున్నారు.

కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో మార్చి 22న కేంద్రం ప్రకటించిన లాక్‌డౌన్ కారణంగా ఇరు రాష్ట్రాల మధ్య బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. అనంతరం లాక్‌డౌన్ సడలింపులతో మే 21 తర్వాత కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా తదితర పొరుగు రాష్ట్రాలకు ఏపీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. అయితే, మూడు నెలలు గడిచినా తెలుగు రాష్ట్రాల మధ్య సర్వీసులు ప్రారంభం కాలేదు. రాష్ట్ర విభజన అనంతరం ఇరు రాష్ట్రాల మధ్య అంతర్రాష్ట్ర ఒప్పందం చేసుకోకపోవడం వల్ల తాము నష్టపోతున్నామని.. ఒప్పందం కుదుర్చుకున్నాకే బస్సులు నడిపేందుకు అనుమతిస్తామని తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టడంతో బస్సు సర్వీసులు ప్రారంభం కాలేదు. ఒప్పందంపై జూన్ తొలివారంలో విజయవాడలో ఇరు రాష్ట్రాల మధ్య ఓ దఫా చర్చలు జరిగాయి. ఆ చర్చల్లో ఒప్పందానికి ఇరు రాష్ట్రాల అధికారులు సమ్మతి తెలిపారు. తదనంతరం మరో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో బస్ భవన్‌లో కరోనా ప్రబలడంతో సమావేశాలు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఎట్టకేలకు ఇవాళ ఇరు రాష్ట్రాల అధికారులు సమావేశమయ్యారు. అంతర్రాష్ట్ర ఒప్పందంపై ఇరు రాష్ట్రాల అధికారులు సంతకాలు చేశాక తెలుగు రాష్ట్రాల మధ్య బస్సు సర్వీసులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని సంబంధిత అధికారులు వెల్లడించారు.

# చైనాపై సైనిక చర్యకైనా సిద్ధమే

### జనరల్ రావత్



దిల్లీ: చైనాతో సరిహద్దు వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆ దేశంపై సైనిక చర్యకు దిగేందుకైనా తాము సిద్ధంగానే ఉన్నట్లు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ తెలిపారు.

లడఖ్‌లో ఇటీవల పీఎల్ఏ దళాలు దురాక్రమణకు తెగించిన అంశంపై ఓ మీడియాతో స్పందిస్తూ ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం రెండు దేశాల సైనిక అధికారులు, దౌత్యాధికారుల మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఒకవేళ ఆ చర్చలు విఫలమైతే అప్పుడు డ్రాగన్ దేశానికి సైన్యంతో బదులివ్వగలమన్నారు. సరిహద్దు సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలన్నదే ప్రభుత్వ విధానం అని, అయినా రక్షణ దళాలు మాత్రం ఎటువంటి సైనిక చర్యకు దిగేందుకైనా సిద్ధంగా ఉంటాయని, ఎల్ఏసీ శాంతి కోసం ఇతర ప్రక్రియలు విఫలమైతే అప్పుడు సైనిక చర్య అనివార్యం అవుతుందని జనరల్ బిపిన్ రావత్ తెలిపారు.

లడఖ్‌లో శాంతి స్థాపన కోసం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్ఎస్ఏ అధికారి అజిత్ దోవల్ ఆ ప్రయత్నాల్లో ఉన్నట్లు చెప్పారు.

# వారి బాధ్యత కేంద్రానిదే



దిల్లీ: వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం జాతీయ అర్హత పరీక్ష (నీట్)ను దేశవ్యాప్తంగా సెప్టెంబరు 13న నిర్వహించనున్నారు. ఈ పరీక్ష రాసేందుకు విదేశాల నుంచి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను వందే భారత్ విమానాల్లో తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. అలానే వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించడంపై దృష్టి సారించాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)కు సూచించింది. "జేఈఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నప్పుడు వచ్చే ఏడాది నుంచి నీట్ ఆన్‌లైన్ నిర్వహణ అంశాన్ని ఎంసీఐ పరిగణలోకి తీసుకోవాలి" అని కోర్టు వ్యాఖ్యానించింది.

కొద్ది రోజుల క్రితం నీట్ పరీక్ష వాయిదా వేయడం లేదా జేఈఈ పరీక్ష తరహాలో విదేశాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలని విదేశాల నుంచి పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, వారిని వందే భారత్ విమానాల ద్వారా భారత్‌కు తీసుకురావాలని కేంద్రాన్ని ఆదేశించింది. అలానే విద్యార్థులు పరీక్ష రాసేందుకు అనుమతించడంపై సంబంధిత మంత్రిత్వ శాఖలతో మాట్లాడాలని కేంద్రం తరపున వాదనల వినిపిస్తున్న సొలిసిటరేట్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. క్వారంటైన్ నిబంధనలు అమలులో ఉన్నందున వారు పరీక్ష రాసేందుకు వస్తున్నారని నిర్ధారిస్తే అనుమతి లభిస్తుందని మెహతా కోర్టుకు విన్నవించారు. అయితే క్వారంటైన్ నిబంధనల నుంచి సడలింపు ఇస్తూ తాము ఆదేశాలు ఇవ్వలేమని, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు సూచించింది.

### అతి పెద్ద తప్పిదం: సుబ్రమణియన్ స్వామి

కరోనా నేపథ్యంలో నీట్, జేఈఈ పరీక్షలు వాయిదా వేయాలని రాజ్యసభ సభ్యుడు సుబ్రమణియన్ స్వామి మరోసారి కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో మోదీ ప్రభుత్వం నీట్, జేఈఈ పరీక్షలు నిర్వహించడం అతి పెద్ద తప్పిదమని అన్నారు. 1976లో అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వం చేపట్టిన నాస్‌బందీ (నిర్భంద కుటుంబ నియంత్రణ)తో ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణను పోల్చారు. దాని వల్లే 1977 ఎన్నికల్లో ఆమె ఓడిపోయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. భారతీయ ఓటర్లు నిశ్శబ్దంగా బాధను అనుభవించినప్పటికీ దాని ప్రభావం దీర్ఘకాలం ఉంటుందని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే నీట్, జేఈఈ పరీక్షలు వాయిదా వేయాలని సుబ్రమణియన్ స్వామితో పాటు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌధరీ కేంద్రాన్ని కోరిన సంగతి తెలిసిందే.

# కొవిడ్‌తో ఊపిరితిత్తుల్లో నష్టం ఇలా.. !

### కళ్లకు కట్టిన వినూత్న చిత్రీకరణ విధానం



బెర్లిన్: తీవ్రస్థాయి కొవిడ్-19 వల్ల ఊపిరితిత్తుల్లో జరిగే నష్టాన్ని జర్మనీ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. దెబ్బతిన్న ఊపిరితిత్తుల కణజాలాన్ని చిత్రీకరించడానికి వీరు హై రిజల్యూషన్ ఇమేజింగ్‌తో కూడిన వినూత్న విధానాన్ని ఉపయోగించారు. ఈ మహమ్మారికి చికిత్స చేయడానికి కొత్త మార్గాలను కనుగొనడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుందని వారు చెప్పారు. గాటింగెన్ విశ్వవిద్యా లయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. వీరు ఒక వినూత్న ఎక్స్‌రే విధానాన్ని కనుగొన్నారు. ఇది కరోనా వైరస్‌తో ఇన్‌ఫెక్షన్‌కు గురైన ఊపిరితిత్తుల కణజాలాన్ని త్రీడీలో, అత్యధిక రిజల్యూషన్‌తో చిత్రీకరించడానికి వీలు కల్పించింది. "అంతర్గతంగా ఏం జరుగుతోందన్నది మనం స్పష్టంగా చూడటం వల్ల రోగి ఉపశమనానికి ఎలాంటి విధానాలు, ఔషధాలు ఉపయోగించాలన్న దానిపై స్పష్టత వస్తుంది" అని పరిశోధనలో పాలుపంచుకున్న డేనీ జోనిగ్ చెప్పారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com